Visakha
Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారం




RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 218 విశాఖపట్నం, 12 జూన్ 2024 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

# రాష్ట్రంలో నేటి నుంచి ప్రజా పరిపాలన - ప్రతి అడుగు ప్రజలకోసమే




**అమరావతి:** రాష్ట్రంలో బుధవారం నుంచి ప్రజాపాలన సాగుతుందని, ప్రతి నిర్ణయం ప్రతి అడుగు ప్రజల కోసమే ఉంటుందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజావేదికల కూల్చివేతలు, మూడు రాజధానుల పేరుతో ఆటలు ప్రజా ప్రభుత్వంలో ఉండవని ఉద్ఘాటించారు. బాధ్యతాయుతమైన, ఒక పాజిటివ్ గవర్నమెంట్ ఉంటుందని చంద్రబాబు అన్నారు. ప్రజలు తమకు ఇచ్చింది అధికారం కాదని, అత్యున్నతమైన బాధ్యత అని పేర్కొన్నారు. అశాంతికి తావు లేకుండా రాష్ట్రంలో పాలన ఉంటుందన్నారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, పురంధరేశ్వరి పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పేరును పవన్ కళ్యాణ్ ప్రతిపాదించగా పురంధరేశ్వరి, అచ్చెన్నాయుడు బలపరిచారు. దీనికి కూటమి ఎమ్మెల్యేలంతా ఆమోదం తెలిపారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ "నేను చాలా ఎన్నికలు చూశాను కానీ ఈ ఎన్నికల్లో ప్రజలు రాష్ట్ర చరిత్రలో లేని విధంగా తీర్పు ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన తీర్పును నిలబెట్టుకునే బాధ్యత మనందరిపై ఉంది. కూటమికి ఘన విజయాన్ని అందించిన ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా. ప్రమాదంలో ఉన్న రాష్ట్రాన్ని కాపాడుకోవాడానికి ప్రజలు చొరవ చూపారు. ప్రజలు గెలవాలి - రాష్ట్రం నిలవాలి అనేది మన లక్ష్యమని ఎన్నికల ముందు ప్రచారం చేశాం. ప్రజలు గెలిచారు. రాష్ట్రాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనపై ఉంది. అరాచక, విధ్వంసకర పాలనను ఐదేళ్లు ప్రజలు భరించారు. మూడు పార్టీలు అత్యున్నత ఆశయాలతో పొత్తు పెట్టుకున్నాయి. ఎన్నోసార్లు కలయిక జరిగినప్పటికీ ఇప్పటి పొత్తును నూటికి నూరు శాతం కార్యకర్తలు, నేతలు స్వాగతించి సమిష్టిగా పని చేశారు. కూటమి విజయానికి కష్టపడ్డ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలను మనస్ఫూర్తిగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నా" అని చంద్రబాబు అన్నారు.

**ప్రజలు పెట్టుకున్న నమ్మకంతోనే ఇంతటి విజయం**

"1994లో జరిగిన ఎన్నికలు ఏకపక్షంగా జరిగినప్పటికీ ఇన్ని ఓట్లు, సీట్లు రాలేదు. ఈ ఎన్నికల్లో మనం ఓడిపోయింది కేవలం 11 సీట్లలో మాత్రమే. 93 శాతం స్ట్రైక్ రేట్‌తో 57 శాతం ఓట్లను కూటమి సాధించింది. ఇది గెలుపు మాత్రమే కాదు. మనపై ఉన్న బాధ్యత. శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, అమలాపురం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, కృష్ణా, గుంటూరు, నరసరావుపేట, నెల్లూరు, అనంతపురం, హిందూపురం, చిత్తూరు, నంద్యాల పార్లమెంట్ స్థానాల పరిధిలో కూటమి క్లీన్ స్వీప్ చేసింది. జనసేన 21 సీట్లలో పోటీ చేసి 21 స్థానాలనూ గెలించింది. బీజేపీ 10 స్థానాల్లో పోటీ చేస్తే 8 చోట్ల విజయం సాధించింది. ప్రజలు మనల్ని ఆశీర్వదించి గెలిపించారు. మనకు ఇలాంటి విజయం...ఇంతటి సంతోషం ఎప్పుడూ లేదు. దీనికి కారణం ప్రజలు మనపై పెట్టుకన్న నమ్మకం. 95 వేల ఓట్ల మెజార్టీతో గాజువాకలో టీడీపీని గెలిపించారు. ఫలితాలతో ఏపీ ప్రతిష్ట, గౌరవం పెరిగింది. ఏ స్థానాన్ని ఏ అభ్యర్థికి కేటాంచాలో నిర్ణయించి గెలుపే ధ్యేయంగా సీట్లు కేటాయించాం." అని చంద్రబాబు వివరించారు.

**కష్టకాలంలో పవన్ కళ్యాణ్ మద్దతు ఎప్పుడూ మర్చిపోలేను**

"అక్రమ కేసులతో నన్ను జైల్లో పెట్టినప్పుడు పవన్ కళ్యాన్ ఇచ్చిన మద్దతును ఎప్పుడూ మరిచిపోను. నేను రాజమండ్రి జైల్లో ఉన్నప్పుడు నన్ను పరామర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని గతంలో చెప్పినప్పటికీ జైల్లో నన్ను కలిసిన అనంతరం పొత్తు ప్రకటించారు. మూడు పార్టీలు కలిసి పోటీ చేసేందుకు చొరవ తీసుకున్నారు. ఎన్నికల సమయంలో ధర్మవరంలో పర్యటించిన అమిత్ షా వైసీపీ ప్రభుత్వ అవినీతిని ఎండగట్టడంతో పాటు ఏపీకి ఏం అవసరమో చెప్పారు. దీంతో ప్రజల్లో ఒక ఆలోచన మొదలైంది. కూటమిపై నమ్మకం పెరిగింది. చిలకలూరిపేట, రాజమండ్రి, అనకాపల్లి, రాజంపేట సభలతో పాటు విజయవాడ రోడ్ షోలో మోదీ పాల్గొన్నారు. ఈ సభలు, రోడ్ షో లకు ప్రజల నుండి విశేషమైన స్పందన వచ్చింది. కూటమి నేతలు, కార్యకర్తలు ఈ ఎన్నికల్లో కష్టపడ్డ విధానం ఎప్పుడూ చూడలేదు...ప్రతి ఒక్కరూ మనసుపెట్టి పని చేశారు. మీ సహకారంతోనే

(మిగతా 2లో)

# కౌన్సిలింగ్‌పై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ



**న్యూఢిల్లీ:** ఎంబిబిఎస్, బిడిఎస్‌తో పాటు ఇతర కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే కౌన్సిలింగ్ ప్రక్రియపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. నీట్ పరీక్షలో అక్రమాలపై ప్రతిస్పందన తెలియజేయాల్సిందిగా జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లాలతో కూడిన వెకేషన్ బెంచ్ నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ)ని ఆదేశించింది.

నీట్ ప్రశ్నాపత్రం లీక్, ఇతర అక్రమాల కారణంగా మరోసారి నీట్ -యుజి పరీక్ష నిర్వహించాలంటూ దాఖలైన పిటిషన్‌లపై నేడు సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. నీట్ ప్రశ్నాపత్రం లీక్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు)ని ఉల్లంఘిస్తోందని, న్యాయమైన పద్ధతిలో పరీక్షను రాసిన విద్యార్థుల కన్నా కొంతమంది అభ్యర్థులకు ప్రయోజనం కల్పించిందని పిటిషన్ పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌తో పాటు శివంగి మిశ్రా, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌ను ట్యాగ్

(మిగతా 2లో)

# కేంద్ర మంత్రిగా నా తొలి లక్ష్యం అదే

ఏపీలో ఎయిర్‌పోర్ట్‌ల అభివృద్ధికి కృషి చేస్తా అంటున్నారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులను జెట్ స్పీడ్‌తో పూర్తి చేస్తామంటున్న మంత్రి.. అక్కడ ఫ్లైట్ ఎగరడమే తన తొలి లక్ష్యమంటున్నారు. పౌర విమానయాన శాఖ మంత్రి బాధ్యతలను ప్రధాని మోదీ ఏరి కోరి తనకు అప్పగించారని చెప్పారు. తనపై మోదీ ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతానని వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో భారత దేశ కీర్తి ప్రతిష్టలను పెంపొందించడంలో పౌర విమానయాన శాఖ పాత్ర చాలా ఉంద న్నారు. యువకుడివి,



విదేశాలు తిరిగావు, ఇంజనీరింగ్ విద్యాభ్యాసం ఉంది.. కాబట్టి ఈ శాఖను నీకు ఇస్తున్నాను అంటూ ప్రధాని మోదీ చెప్పారని వెల్లడించారు. ఈ శాఖ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో

(మిగతా 2లో)

# సమష్టిగా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళదాం: పవన్ కళ్యాణ్

విజయవాడ: గత ఐదేళ్లుగా రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు తలెత్తాయని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపా కూటమి కలిసి కట్టుగా పోరాడి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుందని చెప్పారు. కూటమి శాసన సభాపక్ష నేతగా చంద్రబాబు పేరును ప్రతిపాదించిన అనంతరం పవన్ మాట్లాడారు.

"తెదేపా, జనసేన, భాజపా ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు. అందరం కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన మెజారిటీలతో గెలిచాం. 164 శాసనసభ స్థానాలు, 21 ఎంపీలను ఎన్డీయే కూటమి దక్కించుకుంది. అద్భుతమైన విజయం ఇది. కూటమి అంటే ఎలా ఉండాలో రాష్ట్ర ప్రజలు కలిసికట్టుగా చూపించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వం అని ఇప్పటం సభలో చెప్పాం.. అదే మాటపై నిలబడ్డాం.



ఒడుదొడుకులు ఎదుర్కొన్నాం.. తగ్గాం.. ప్రజల్లో నమ్మకాన్ని పెంచి అద్భుతమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని స్థాపించబోతున్నాం. కక్ష సాధింపులకు, వ్యక్తిగత దూషణలకు ఇది సమయం కాదు. మనందరం సమష్టిగా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి. సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, శాంతి భద్రతల విషయంలో బలంగా నిలబడతామని చెప్పాం.

ఉమ్మడి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సమయంలో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడు కావాలి. నాలుగు దశాబ్దాల అనుభవం, అభివృద్ధిపై అపారమైన అవగాహన, పెట్టుబడులను తీసుకొచ్చే సమర్థత, ప్రతిభ, విదేశాల అధ్యక్షులను తెలుగు రాష్ట్రాల వైపు దృష్టి మళ్లించే శక్తి ఉన్న చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరం. ఆయన నలిగిపోయారు. జైల్లో చూశాను. అప్పుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పడిన బాధను చూశాను. మంచిరోజులు వస్తాయి.. కన్నీళ్లు పెట్టొద్దని చెప్పాను. ఆ రోజులు వచ్చాయి. చంద్రబాబుకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెబుతున్నా.. అద్భుతమైన పాలన అందివ్వాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. ఈ సందర్భంగా పవన్‌ను చంద్రబాబు ఆలింగనం చేసుకుని ధన్యవాదాలు తెలిపారు.

# ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు విడుదల



ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ 2024 ఫలితాలు విడుదల అయ్యాయి.. ఏపీ ఈఏపీసెట్ ఫలితాలను ఏపీ ఈఏపీసెట్ సెట్ ఛైర్మన్, జేఎన్‌టీయూ-కాకినాడ వీసీ ప్రసాదరాజు, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ రామ మోహన్‌రావు సంయుక్తంగా విడుదల చేశారు. చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఈఏపీసెట్‌ను జేఎన్‌టీయూ- కాకినాడ నిర్వహించగా.. ఈ రోజు సాయంత్రం 4 గంటలకు విజయవాడలో విడుదల చేశారు. ఫలితాలను అధికారిక వెబ్ సైట్ cets.apsche.ap.gov.in లో చెక్ చేసుకోవచ్చు..

ఫలితాన్ని చూసుకున్న తర్వాత భవిష్యత్తు అవసరాల కోసం ర్యాంకు కార్డు డౌన్‌లోడ్ చేసుకోండి..

**పరీక్షా ఫలితాలు ఇలా..**

ఇంజనీరింగ్ కోసం 2,74,213 మంది దరఖాస్తు చేసుకోగా.. 2,58,374 మంది హాజరయ్యారు. వారిలో 1,95092 మంది క్వాలిఫై అయ్యారు. ఉత్తీర్ణత శాతం.. 75.51..

అగ్రికల్చర్ పరీక్ష కోసం 88638 మంది దరఖాస్తు చేసుకోగా.. పరీక్షకు 80,766 మంది హాజరయ్యారు. వారిలో 70,352 మంది క్వాలిఫై కాగా.. ఉత్తీర్ణత శాతం 87.11..

ఈఏపీసెట్‌లో ఇంటర్మీడియట్ మార్కులకు 25% వెయిటేజీ ఉంటుంది. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులు, ఇంటర్మీడియట్ వెయిటేజీ మార్కులు రెండింటి ఆధారంగా తుది ర్యాంకులు ప్రకటిస్తారు.

కాగా, రాష్ట్ర వ్యాప్తంగా మే 16 నుంచి 23 వరకు ఈఏపీసెట్ పరీక్షలు నిర్వహించారు.

(మిగతా 2లో)

# అధికారంలోకి వస్తామని తెలుసు కానీ ఇంత ఘన విజయం సాధిస్తామని అనుకోలేదు

ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిన క్షణంలోనే విజయంపై అందరికీ నమ్మకం ఏర్పడిందని బీజేపీ ఏపీ చీఫ్ పురందేశ్వరి చెప్పారు. అయితే, ఇంత ఘన విజయాన్ని మాత్రం ఊహించలేదని చెప్పుకొచ్చారు. కూటమికి ఇది అనూహ్య విజయమని చెప్పారు. ఈమేరకు మంగళవారం జరిగిన ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశంలో పురందేశ్వరి మాట్లాడారు. ఐదేళ్ల జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు నిజమైన సంక్షేమానికి దూరమయ్యారని చెప్పారు. అభివృద్ధి అనే పదానికి అర్థం లేకుండా పోయిందన్నారు.

ప్రజావ్యతిరేక పాలనను అంతమొందించాలని నిర్ణయించుకున్న ప్రజలు.. కూటమికి అనూహ్య విజయాన్ని కట్టబెట్టారని, ఇందుకు వారికి సభాముఖంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని పురందేశ్వరి చెప్పారు. 'చంద్రబాబు యుక్తి, నరేంద్ర మోదీ స్ఫూర్తి, పవన్ కల్యాణ్ శక్తి.. ఈ మూడింటి కలయికే ఇవాళ రాష్ట్ర ప్రజల ముందుకు కూటమి రూపంలో వచ్చింది'



అని చెప్పారు. ప్రజా సంక్షేమంపైనే దృష్టి పెట్టి, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పాలన కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ క్రమంలో కక్షపూరిత రాజకీయాలకు తావివ్వకుండా పార్టీ కార్యకర్తలను సంయమనం పాటించేలా చూడాలని పురందేశ్వరి కూటమి నేతలకు సూచించారు. ఐదేళ్లలో కూటమిలోని పార్టీలకు చెందిన కార్యకర్తలు అనేక కష్టాల పాలయ్యారని, ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన ఈ సమయంలో ఒకింత అత్యుత్సాహం ప్రదర్శించకుండా మన కార్యకర్తలను

(మిగతా 2లో)



## విద్యా కానుక కిట్ల నాణ్యత పైదృష్టి సారించాలి : తెలుగుదేశం



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): విద్యా సంవత్సరం ఆరంభం లో విద్యార్థులకు పంపిణి చేయనున్న విద్యా కానుక కిట్ల నాణ్యత పై అధికారులు దృష్టి సారించాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. భీమిలి లో గల తెలుగుదేశం పార్టీకార్యాలయం లో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణి జరుగుతూనే ఉన్నదని, అయితే వైసీపీ ప్రభుత్వ కాలం లో కిట్లకు రంగులు, స్టిక్కర్లకు ఇచ్చిన ప్రాధాన్యత కిట్ల నాణ్యత కు కు ఈయలేదని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే స్కూల్ బ్యాగ్ లు, బెల్టులు షూలు మొదటి నెలలోనే చిరిగిపోయి విద్యార్థులు వినియోగించుకోలేని స్థితి లో ఉన్నాయంటే వాటి నాణ్యత ఎలావుందో ఇట్టే అర్థం అవుతుందని ఆయన అన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన దరిమిలా అధికారులు చిత్త శుద్ధితో వ్యవహరించి విద్యాకానుక కిట్ల నాణ్యత పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

## చెత్త పన్ను వసూలు నిలిపివేయడం హర్షణీయం



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయక ముందే చెత్త పన్ను వసూళ్లు నిలిపివేయడం హర్షణీయం అని తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంటరీ కార్యదర్శి పిట్ట సురేష్ అన్నారు. చిట్టివలసలో గల పార్టీ కార్యాలయం లో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు చెల్లించే ఇంటి పన్నుల విషయం లో గ్రంధాలయం, పారుశుద్ధ్యం, క్రీడలు, వీధి లైట్ లు వంటి సౌకర్యాలను కల్పించవలసిన బాధ్యత స్థానిక సంస్థల ప్రభుత్వం దే అని ఆయన అన్నారు. అయితే జగన్ ప్రభుత్వం అందుకు విరుద్ధం గాచెత్త సేకరణ పేరుతో యూజర్ ఛార్జీల పేరిట వసూళ్లు చేసి ప్రజలను తీవ్రమైన ఇబ్బందులకు గురించేసిందని ఆయన అన్నారు. అయితే ఎన్నికల ప్రచారం లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాకముందే చెత్త పన్ను వసూలునిలిపి వేయడం ప్రజల పట్ల అయనకు ఉన్న చిత్త శుద్ధికి నిదర్శనం అని ఆయన అన్నారు. ప్రభుత్వం ఏర్పడక ముందే ప్రజా రంజక పాలన మొదలయ్యిందని, ఇక కూటమి ప్రభుత్వ పాలన లో రాష్ట్ర ప్రజలకు అంతా మేలే జరుగుతుందని ఆయన అన్నారు. సమావేశం లో తెలుగుదేశం నాయకులు భీమవరపు ప్రకాష్, అల్లు రవి, పల్ల అప్పలకొండ, చిన్నమల గిరి, పెండ్యాల మహేష్, పిట్ట రామారావు తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా కొత్తమ్మతల్లి పండుగ





భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): భీమిలి చిట్టివలస పరిధి సంతపేట లో కొలువైఉన్న కొత్తమ్మ తల్లి పండుగ మంగళవారం వేడుకగా నిర్వహించ బడినది. చిట్టివలస, సంతపేట వెలంపేట కొత్తపేట, కార్మిక వాడ, విల్సన్ పేట తదితర ప్రాంతాలనుండి భక్తులు తెల్లవారుఝాముననే ఆలయం కు చేరుకొని అమ్మవారిని దర్శనం చేసుకొన్నారు.మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించుకొని మొక్కుబడులు చెల్లించుకొన్నారు.

ఈ సందర్భంగా చిట్టివలసకు చెందిన తెలగా సేవా సంఘము ప్రతినిధులు సుమారు 3 వేలమంది భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేసారు. కార్యక్రమం లో సంఘము ఉపాధ్యక్షులు రంగూరి గిరిధర్, కార్యదర్శి నార్ల వాసు, మేకల రమేష్, నక్కానరమేష్, దేశెట్టి లీలా సుశీల పాల్గొన్నారు. కాగా అమ్మవారిని దర్శించికొన్నవారిలో భీమిలి ఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు సతీమణి శారదా, తెలుగుదేశం నాయకులు తదితరులు ఉన్నారు.

## నేటి నుండి అద్భుత పాలన చూస్తాం : సీతంరాజు సుధాకర్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): నేటి నుండి అద్భుత పాలన చూస్తాం అని దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్ అన్నారు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా విశాఖ టిడిపి కార్యాలయం నుంచి విజయవాడలో సీఎం ప్రమాణ స్వీకార వేడుకకి బయలుదేరిన బస్సులకు సుధాకర్ జెండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఎదురు చూసిన క్షణాలు ,నారా చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రి గా ప్రమాణ స్వీకారం అని అన్నారు వైసిపి అరాచక పాలన నుంచి విసిగిపోయిన క్షణాలు నుంచి ఒక అద్భుత పాలన చూస్తాం అని పేర్కొన్నారు . కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్పొరేటర్లు, నాయకులు , కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## చంద్రబాబు హయాంలోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖపట్నం కు చెందిన ప్రముఖ సామాజిక రాజకీయ విశ్లేషకురాలు డా. ఊహ మహంతి, నాలుగోసారి ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు నాయుడుకి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గత మూడు పర్యాయాల్లో ముఖ్య మంత్రిగా చంద్రబాబు గారు పరిపాలిం చిన సమయంలోనే మన రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించిందని, ఇప్పుడు నాలుగోసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం గొప్ప విషయం అని అన్నారు. ఈ సంధ్భంగా ఆమె మాట్లా డుతూ, చంద్రబాబు నాయకత్వంలో, జనసేన నేత పవన్ కళ్యాణ్‌తో కూటమి ఏర్పడిన కారణంగా, రాష్ట్రం మరింత సుస్థిర పరిపాలనను అనుభవించి, సమర్థవంతమైన అభివృద్ధిని పొందగలదని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ గారు కూడా సహకారం అందిస్తారని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలు మరియు సంస్కరణలు దేశాన్ని ప్రగతిపథంలో నడిపేందుకు దోహదపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి నేడు ప్రమాణస్వీకారం చేస్తున్న చంద్రబాబు నాయుడు గారికి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కి మరియు నేడు ప్రమాణస్వీకారం చేస్తున్న మంత్రివర్గ సభ్యులందరికీ డా. ఊహ మహంతి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

| | | |
|---|---|---|
| పంచాంగం | బుధవారం 12-06-2024<br>క్రోధి నామ సంవత్సరము<br>ఉత్తరాయణం, గ్రీష్మరుతువు<br>జ్యేష్ఠమాసం | |
| తిథి | : శు. షష్ఠి రా. 07.12 | |
| నక్షత్రం | : మఘ రా. 02.32 | |
| వర్జ్యం | : ప. 01.28 ల 03.12 | |

## అమానంలో బంగారమ్మ వారాల పండుగ



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): భీమిలి మండలం అమానం గ్రామం లో కొలువై ఉన్న బంగారమ్మ తల్లి వారాల పండుగ మంగళవారం ఘనంగా జరిగింది.పూజారి గొర్సు రామిరెడ్డి దుర్గాలమ్మ, బంగారమ్మ తల్లి, అలాగే పోలమ్మ, ముత్యాలమ్మ ప్రతిమలను జంగిడి లో ఉంచి గ్రామం అంతా తిరిగారు. ఈ సందర్భం గా మహిళలు అమ్మవార్లకు పసుపు కుంకుమలు, ఫలాలు అమ్మవార్లకు సమర్పించి ప్రత్యేక పూజలు చేసారు. రాత్రి పోలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల అనుపుతో బంగారమ్మ వారాల పండుగ ముగిసింది. కార్యక్రమం లో పలువురు పాల్గొన్నారు.

## పిహెచ్‌సిని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): భీమిలి మండలం రాజుల తాళ్ళవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జగదీశ్వర రావు మంగళవారం సందర్శించారు. ముందుగాఆయన ఆరోగ్య కేంద్రం లో రికార్డులను పరిశీలించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఏఎన్ఎం లకు, ఆషా వర్కర్లకు సూచించారు.. అనంతరం బిసిజి వాక్సిన్ వేసే విధానం పై సిబ్బందికి, ఆషా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమం లో కార్యక్రమం అధికారి డాక్టర్ ఉమావతి, ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయిలు)

## రాష్ట్రంలో నేటి నుంచి ప్రజా పరిపాలన...ప్రతి అడుగు ప్రజలకోసమే

4వ సారి సీఎంగా రేపు ప్రమాణస్వీకారం చేస్తున్నా. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతాం. మళ్లీ ప్రజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైంది. రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో కేంద్ర సహకారం కూడా అవసరం...ఈ మేరకు కేంద్రం కూడా హామీ ఇచ్చింది. మోదీ, అమిత్, నడ్డాతో పాటు కేంద్ర నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా." అని చంద్రబాబు అన్నారు.

**నాకు తెలిసింది ప్రజాహితం..ప్రజల కోసం కష్టపడటమే**

"45 ఏళ్ల నా రాజకీయ జీవితంలో రాగద్వేశాలకు అతీతంగా పని చేశాను. ప్రజల కోసం కష్టపడటం, ప్రజాహితమే నాకు తెలుసు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతా. నా ప్రతి ఆలోచన, తపనంతా ప్రజల కోసమే. ఎన్నో విజయాలు చూశాను...సంక్షోభాలు చూశాను. సంక్షోభాలను అవకాశాలుగా మార్చుకున్నాం. రాష్ట్రంలో చాలా సమస్యలు ఉన్నాయి. పేదల జీవితాలు మార్చడానికి నిత్యం పని చేసి మన నిజాయితీని ప్రజలకు తెలియజేద్దాం. రాష్ట్రం పూర్తిగా శిథిలమైంది. దెబ్బతినని వర్గమంటూ లేదు. చిన్న పనులు చేసుకునే వారు సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని వచ్చి ఓట్లు వేసి వెళ్లారు. విదేశాల్లో ఉన్నవారు లక్షల ఖర్చు పెట్టుకుని వచ్చి ఓట్లు వేశారు. ఓటర్లు బాధ్యతగా నిర్వర్తించిన ప్రవర్తన తెలుగుజాతి చరిత్రలో నిలిచిపోతుంది. ఏ అహంకారంతో పాలకులు విర్రవీగారో అది పూర్తిగా అనిగిపోయింది. పదవుల్లో ఉన్నామని విర్రవీగితే ఇలాంటి ఫలితాలే వస్తాయి. ఇవన్నీ కేస్ స్టడీగా మీరు తీసుకోవాలి. ప్రజలు బూతులు మాట్లాడిన నేతలు, అరాచక శక్తులు, అవినీతి పరుల్ని చూశారు. పాలకులు అంటే ఎలా ఉండాలో చూశారు...పాలకుడికి ఎలాంటి అర్హత ఉండాలో కూడా ఈ తీర్పు ఒక సూచికం. జగన్ ప్రవర్తన చూశాక ఇలాంటి వ్యక్తి పాలనకు పనికి రాడని ప్రజలు నిర్ణయించుకుని తీర్పునిచ్చారు. పాలన ఎలా ఉండకూడదో..గత పాలన ఒక కేస్ స్టడీ." అని చంద్రబాబు వివరించారు.

**గౌరవసభగా శాసనసభను నడుపుదాం**

"కక్ష తీర్చుకోవాలని ముందకెళ్తే సమస్యలే వస్తాయి. అలాగని తప్పు చేసిన వారిని క్షమించి పూర్తిగా వదిలేస్తే మళ్లీ అదే దారికి వస్తారు. చట్ట పరంగా శిక్షించడంతో పాటు విధ్వంసం, కక్ష రాజకీయాలు చేయకుండా సరైన దారిన పెట్టాలి. కార్యకర్తలపై దాడులు చేసి కేసులు పెట్టి వేధించారు. ఇబ్బందుల్లో ఉన్నవారిని మనం కాపాడుకున్నాం. నడి వీధుల్లో ప్రాణాలు తీస్తూ అరాచకంగా ప్రవర్తించారు. మెడపై కత్తి ఉన్నా జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలిన ఘటన నా కళ్ల ముందు ఇప్పటికీ తిరుగుతోంది. నాకు కూడా అసెంబ్లీలో అవమానం జరిగింది...దాన్ని భరించలేక మళ్లీ ముఖ్యమంత్రిగానే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేసి బయటకు వచ్చాను. అసెంబ్లీని గౌరవ సభగా మార్చుతానని చెప్పాను. మనం శాసనసభను గౌరవ సభగా మార్చి ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు వేదికగా మార్చుకుందాం." అని చంద్రబాబు అన్నారు.

**కక్షపూరిత రాజకీయాలు కాదు...నిర్మాణాత్మక రాజకీయాలు చేద్దాం**

"రాష్ట్రానికి ఎంత అప్పు ఉందో తెలీదు...ఎక్కడ నుండి తెచ్చారో తెలీదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం అయింది. వ్యవసాయం రంగం పూర్తిగా సంక్షోభంలో ఉంది. ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు. పదేళ్ల తర్వాత కూడా రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితి. ప్రజల సమస్యలు చెప్పుకోవడానికి నిర్మించిన ప్రజావేదికను కూల్చి దుర్మార్గంగా వ్యవహరించారు. కక్ష పూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మక రాజయాలు పాటిద్దాం. 2014లో సీఎంగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు ఢిల్లీ వెళ్లాను. పోలవరం ముంపు మండలాలు 7 తెలంగాణలో ఉన్నాయి. ఆ 7 మండలాలు పునరావాసానికి ఒప్పుకుంటే తప్ప సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని మోదీకి చెప్పాను. మొదటి కేబినెట్ లోనే 7 మండలాలు ఏపీలో కలుపుతు నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం సహకారంతో 72 శాతం పనులు పూర్తి చేస్తే.. నేడు మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. డయాఫ్రం వాల్ కొట్టుకుపోయింది. మళ్లీ కేంద్ర సహకారంతో పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానంతో చేసి ప్రతి ఎకరాకు నీళ్లందిస్తాం." అని చంద్రబాబు హామీ ఇచ్చారు.

**రాజధానిగా అమరావతి...ఆర్థిక రాజధానిగా విశాఖ**

"ఏపీకి రాజధానిగా అమరావతే ఉంటుంది. విశాఖ ఆర్థిక రాజధానిగా ఉంటుంది. మూడు పార్టీలకు విశాఖపట్నం ముఖ్యమైన నగరం. 2014లో ఎంపీగా విశాఖలో హరిబాబు భారీ మెజారిటీతో గెలిచారు. తర్వాత 2019లో విశాఖపట్నంలోని 4 సీట్లు గెలిచాం. ఇప్పుడు విశాఖ పార్లమెంట్ ను క్లీన్ స్వీప్ చేశాం. విశాఖను రాజధానిగా చేస్తామని, ప్రమాణ స్వీకారం అక్కడే చేస్తానని జగన్ చెప్పినా ప్రజలు ఇక నువ్వు రావొద్దని తీర్పు ఇచ్చారు. న్యాయ రాజధాని కర్నూలు అంటూ మోసం చేశారు. రాయలసీమలో వన్ సైడ్ గా ఎన్నికలు జరిగాయి. ఊహించని మెజార్టీని ప్రజలు మనకు ఇచ్చారు. సీఎం వస్తున్నాడంటే చెట్లు కొట్టేయడం, షాపులు బంద్ చేయడం, పరదాలు కట్టడం లాంటివి ఇక ఉండవు. ముఖ్యమంత్రి కూడా మామూలు మనిషే. నేను సీఎంగా ఉన్నా, నా మిత్రుడు పవన్ కళ్యాణ్ ఏ పదవిలో ఉన్నా సామాన్యుల్లా ప్రజల్లో ఒకరిగానే ఉంటాం. హోదా సేవ కోసం తప్ప పెత్తనం కోసం కాదు. మేము బయటకు వచ్చినప్పుడు ప్రజలు ఎవ్వరూ ఇబ్బంది పడకూడదన్నది మా విధానం." అని చంద్రబాబు అన్నారు.

**స్టేట్ ఫస్ట్ నినాదంతో ముందుకు వెళదాం**

"గత ప్రభుత్వం దాడులు చేసి బాధితులపైనే కేసులు పెట్టింది. ఏ ఒక్కరి ఆత్మగౌరవానికి మన ప్రభుత్వంలో భంగం కలగదు. స్టేట్ ఫస్ట్ నినాదంతో ముందుకు వెళతాం. కేంద్రంలో రాష్ట్రానికి సముచిత గౌరవం దక్కింది. కేంద్రంలో ముగ్గురు మంత్రులుగా ఉన్నారు. రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసర వర్మకు మంత్రి పదవులు వచ్చాయి. సాధారన వ్యక్తులకు కూడా బీజేపీ ఎంపీ టికెట్లు ఇచ్చింది. టీడీపీ-జనసేన కూడా అదే పంథాలో ఉన్నాయి. పదేళ్ల మోదీ పాలన దేశ ప్రతిష్టను పెంచింది. ప్రపంచంలోనే భారతీయులకు గుర్తింపు వచ్చింది. గతంలో 11వ స్థానంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ 5వ స్థానానికి వచ్చింది. ఎన్డీయే 3.0 ప్రభుత్వంలో 3వ ఆర్థిక అతిపెద్ద దేశంగా భారత్ అవతరించబోతోంది. 2047 నాటికి వికసిత్ భారత్ మోదీ కల...మనందరి కల వికసిత్ ఏపీ అనే లక్ష్యంతో ముందుకు వెళ్దాం. పేదరికం లేని దేశం, రాష్ట్రంగా మారాలి. పేదరికం లేని సమాజం ఎన్టీఆర్ కల. తనకు తెలిసిన ఒకే ఒక్క ఇజం హ్యూమనిజం అని ఎన్టీఆర్ చాటి చెప్పారు. సమాజమే దేవాయలం- ప్రజలే దేవుళ్లు అని ముందుకెళ్లిన ఎన్టీఆర్ కలలను సాకారం చేద్దాం." అని చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

**ముందుకు నడిపించండి...తప్పు చేస్తే ఫీడ్ బ్యాక్ ఇవ్వండి**

ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా..మీరు ఓట్లు వేశారు..మమ్మల్ని గెలించారు. ఓటు వేశాక మీ బాధ్యత తీరిపోయిందను కోకుండా నిత్యం మమ్మల్ని ఆశీర్వదించి ముందుకు నడపాలి. మొన్నటి ఎన్నికల్లో ప్రతి పోలింగ్ స్టేషన్ జనంతో నిండి ఉండి రాత్రి 2 వరకు క్యూలో ఉండి ఓట్లు వేశారు. నన్ను నడిపించండి...తప్పు చేస్తే ఫీడ్ బ్యాక్ ఇవ్వండి. కలిసి ముందుకు సాగి రాష్ట్రాన్ని పునర్నిర్మించుకుందాం. ప్రపంచలో 2047 నాటికి మన దేశం మొదటి స్థానంలో ఉంటుంది. తెలుగుజాతి ప్రపంచంలో నెంబర్ 1 గా ఉండాలనేది నా కల. సంపాదనలో తెలుగువారం అగ్రస్థానంలో ఉన్నారు. నిర్దిష్టమైన సమయంలోనే ఏపీని నెంబర్ 1 గా చేసుకుందాం. నన్ను జైల్లో పెట్టినప్పుడు బయటకు రావడానికి 53 రోజులు పట్టింది...అక్కడ ఏం చేస్తారో తెలియని పరిస్థితి ఉంది. నా కోసం నిలబడ్డ కార్యకర్తలు, నాయకులను జీవితాంతం గుర్తు పెట్టుకుంటా." అని చంద్రబాబు నాయుడు అన్నారు.

## కౌన్సిలింగ్‌పై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ

చేసిన సుప్రీంకోర్టు.. ఈలోపు ఎన్‌టిఎ ప్రతిస్పందనను దాఖలు చేయాలని ఆదేశించింది.

మే 5న నీట్-యుజి పరీక్ష నిర్వహించగా, జూన్ 14న ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఎన్‌టిఎ ప్రకటించింది. అయితే పది రోజుల ముందుగానే ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజునే నీట్ ఫలితాలను విడుదల చేసింది.

## కేంద్ర మంత్రిగా నా తొలి లక్ష్యం అదే

విమానయాన మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, కొత్త అవకాశాలను వెతకడం సాధ్యపడుతుందన్నారు. విమానయాన శాఖలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారిస్తామని చెప్పారు. పొరుగునే ఉన్న తెలంగాణలో కూడా విమానయాన రంగానికి తోడ్పాటు అందిస్తానని చెప్పారు. తెలంగాణలో ఉన్న తెలుగు ప్రజల మనసు గెలుచుకునేలా పని చేస్తానన్నారు.


వైయస్సార్సీపీ పాలనలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలంటే 30 శాఖలు మన చేతిలో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అయితే వాస్తవ పరిస్థితిలో అది సాధ్యపడదని.. కానీ మిగతా శాఖలతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకోవచ్చన్నారు. అత్యంత చిన్న వయసు క్యాబినెట్ మంత్రిగా అందరి దృష్టి తనపై ఉంటుందని.. దానికి తగ్గట్టే వ్యవహరిస్తానన్నారు.

## ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు విడుదల

మొత్తం 3,62,851 మంది విద్యార్థులు ఈఏపీసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. వారిలో 3,39,139 మంది పరీక్ష రాశారు.. వీరిలో ఇంజినీరింగ్‌కు సంబంధించి 2,58,373 మంది, వ్యవసాయ, ఫార్మసీ విభాగాలకు సంబంధించి 80,766 మంది పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

## అధికారంలోకి వస్తామని తెలుసు కానీ ఇంత ఘన విజయం సాధిస్తామని అనుకోలేదు

శాంతింపజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్డీయే కూటమి శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు నాయుడు పేరును పవన్ కల్యాణ్ ప్రతిపాదించగా.. పురందేశ్వరి బలపరిచారు.


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నవోదయం
ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల సాకారానికి శుభారంభం
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్డీయే శాసనసభాపక్ష నేత
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి
ప్రమాణ స్వీకార మహోత్సవం
తేదీ & సమయం
జూన్ 12, 2024 (బుధవారం), ఉదయం గం. 11:27 ని.లకు
స్థలం
కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద, గన్నవరం, కృష్ణా జిల్లా
ముఖ్య అతిథులు
భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ గారు
భారత హోమ్ శాఖామాత్యులు శ్రీ అమిత్ షా గారు
విశిష్ట అతిథులు
బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీమతి పురందేశ్వరి గారు
జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు
అందరికీ స్వాగతం... సుస్వాగతం

విశాఖ సమాచారమ్

బుధవారం 12-06-2024

## వివేకానందుని మేథస్సు

జమ్‌షెడ్జీ నస్సర్వాన్జీ టాటా జర్మనీకి పనిమీద ప్రయాణం పెట్టుకున్నారు. అప్పట్లో ఓడ ప్రయాణం. ఆయన తన మొదటి తరగతి క్యాబిన్ తలుపు ముందు నిలబడి చూస్తున్నారు. కింది అంతస్తులో హడావుడిగా ఉండడాన్ని ఆయన గుర్తించి, ఏమిటని అడిగారు.

భారతీయ మహా సాధుపుంగవులు "స్వామి వివేకానంద" ఓడలో కింద ఉన్నారని చెప్పారు.

అంతే ఎంతో ఉత్సాహంగా, జెఎన్ టాటాగారు స్వామివారి దగ్గరికి వెళ్లారు. స్వామి వివేకానంద ఆ మహా పారిశ్రామికవేత్త గురించి ముందే విని ఉన్నారు. ఓడ ప్రయాణం కదా. తాపీగా వారిమధ్య సంభాషణ కొనసాగింది.

టాటాగారు తన జర్మనీ ప్రయాణం ఎందుకన్నది చెప్పారు.

"నేను మన దేశంలోని వివిధ ప్రాంతాల మట్టి నమూనాల సంచులను తీసుకుని జర్మనీలో పరీక్షించే నిమిత్తం తీసుకుపోతున్నాను.

ఎక్కడ తవ్వితే ఇనుమును లాభసాటిగా సేకరించగలమో తెలుసుకుని ఆపని మొదలు పెట్టాలి అని అనుకుంటున్నాను" అని చెప్పుకున్నారు.

అది విన్న స్వామి చిరునవ్వు నవ్వి "బాగుంది. మీరు తీసుకువెళ్లే సంచుల్లో ఇనుప ఖనిజం సంమృద్ధిగా ఉన్న మట్టి నమూనాలు ఉంటే మాత్రం, ఆజర్మనులు నిజం చెబుతారా? ఇక్కడ మనమో విషయాన్ని గమనించుకోవాలి.

ఏ యూరప్ దేశం కూడా బలమైన, లోహ సమృద్ధిని, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, స్వయం సమృద్ధిని సాధించిన భారతదేశాన్ని చూడాలనుకోదు.

మీ దగ్గరి నమూనాల్లో ఇనుప ఖనిజం సమృద్ధిగా ఉన్నా ఆ యూరప్ దేశాలవారు ఆ విషయం చెపుతారని అనుకోను. వారు మీలో అపనమ్మకాన్ని, నిరాశను కలిగించాలని చూస్తారు."

అప్పటికే ఎన్నోసార్లు యూరప్ సంస్థలతో వ్యక్తులతో మాట్లాడి ఉన్న జెఎన్ టాటాగారికి ఈ విషయంలో అనుమానం ఉంది.

కాబట్టే వెంటనే ఏమీ అనలేక పోయారు. స్వామి వివేకానంద "మీరే మట్టి నమూనాలను పరీక్షించడం, లోహాన్ని మరింత లాభసాటిగా సేకరించేందుకు కావలసిన పరిశోధనలు నిర్వహించే ప్రయత్నాలు ఎందుకు చేయకూడదు. మెరికల్లాంటి కొందరు మన భారత యువకులకు శిక్షణ ఇచ్చే ప్రయత్నాలు ఎందుకు చేయకూడదు? అందుకు కావలసిన అన్ని అత్యంత ఆధునిక సదుపాయాలతో ఒక మంచి కళాశాలను ఏర్పాటు చేయవచ్చు కదా.

ఇప్పుడది వ్యర్థం, అనవసర భారం కూడా అనిపించవచ్చును.

కానీ, ముందు ముందు మంచి ఫలితాలను సాధించ గలుగుతాం.

యూరప్ ట్రిప్పులకు అయ్యే బోలెడు ఖర్చు తగ్గుతుంది. నమూనాలను దేశంలోనే పరీక్షించే వెసలుబాటు ఉంటే, మీరు తొందరగా పరీక్షలు చేయించుకుని నిర్ణయాలు వేగంగా తీసుకోగలుగుతారు. సరిగ్గా పరీక్షించారో లేదోననే అనుమానంతో, ఒకరు కాదంటే మరొకరి దగ్గరకు నమూనాలు పట్టుకుని ఇప్పటిలా పరుగులు తీసే ప్రయాస మీకు తప్పుతుంది." అన్నారు.

జెఎన్ టాటాగారిలో సానుకూలతను పసిగట్టిన స్వామి వివేకానంద "మీరు మైసూర్ మహారాజావారు శ్రీ హెచ్‌ఆర్‌హెచ్. చామరాజ వడయార్ గారిని సంప్రదించండి. బ్రిటీష్‌వారికి సామంతులుగా ఉన్నప్పటికి ఆయన ఖచ్చితంగా ఈ విషయంలో మీకు అన్ని విధాల సహాయపడతారు. హెచ్‌ఆర్‌హెచ్. చామరాజ వడయార్ ఎంత ఉదారులంటే, నా చికాగో యాత్రకు కావలసిన మొత్తాన్ని ఆయనే సహాయంగా అందించారు" అని చెప్పారు.

జెఎన్ టాటాగారు భారత్‌కు తిరిగి వస్తూనే తిన్నగా వెళ్లి మైసూర్ మహారాజా వారిని కలిశారు. చామరాజ వడయార్ ఆయన్ని ఏమాత్రం నిరాశపరచలేదు. ఆలోచనను గొప్పగా స్వాగతించారాయన. టాటా కోరుకున్న పరిశోధనలకు కావలసిన సౌకర్యాలతో, ఒక ప్రతిష్ఠాత్మక కాలేజీని ఏర్పాటు చేయడానికి 370 ఎకరాల భూమిని కెటాయించేశారు.

## కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఈనెల 12న ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వానికి ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని మూల పేట గ్రామంలో భవన నిర్మాణ కార్మికులు సమావేశం సంఘం గ్రామం అధ్యక్షులు సి హెచ్. అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ 2013లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వివిధ పథకాలు అమలులో ఉన్నాయన్నారు. జగన్ అధికారంలోకి రాగానే నవరత్నాల పేరుతో అవన్నీ తొలగించేసి కార్మికులను మోసం చేశాడన్నారు. ఇసుక పాలసీ అంటూ ఇసుక వ్యాపారం మొదలుపెట్టి ఇసుక కొరత సృష్టించి కార్మికుల ఆకలి చావులకు, అప్పులకు కారకుడయ్యారన్నారు. సంక్షేమ బోర్డుపై కన్ను పడి బోర్డులోని నిధులను విడతల వారీగా 16వందల కోట్లు తీసుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి నవరత్నాలకు ఆ నిధులను వాడుకున్నారన్నారు. బోర్డులోని సభ్యులకు క్లెయిమ్స్ చెల్లించకుండా కార్మికులను తిప్పలు పెడుతున్నారన్నారు. కార్మికుల పని ప్రదేశంలో ప్రమాదం, జరిగి ఆసుపత్రి పాలైనా చనిపోయిన, లేదా సహజ మరణం పొందిన పట్టించుకునే నాథుడు లేడన్నారు. అలాగే దేశ వ్యాప్తంగా ఒకే తరహాలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కొత్త ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునః ప్రారంభించాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం గ్రామం కార్యదర్శి మారేడు పూడి సత్యనారాయణ, పల్ల నాగరాజు, తోట రాజు, ఉప్పిలి ఆదినారాయణ, శేషు, ఎమ్. రాము, తోట ఈశ్వరరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర ప్రదేశ్‌ని బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దాలి



**విజయనగరం:** అంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు.

మంగళవారం విజయనగరం తోట పాలెంలో తన క్యాంపు కార్యాలయంలో నేడు జరగబోవు అంతర్జాతీయ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల కార్మిక వ్యతిరేక మాసం నేపథ్యంలో విజయవాడకి చెందిన క్రాఫ్ వారు రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ ఇన్చార్జి అధికారి యాళ్ళ నాగరాజు, సిబ్బంది బి రామకోటి, వి . సంధ్య, చైల్డ్ లైన్ సిబ్బంది సి హెచ్ అరుణ్ కుమార్, వి.మీనా వైసిబి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జీ .ఝాన్సి రాణి మరియు ఫాల్గుణ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు అందరూ పాఠశాలల్లో విద్యను అభ్యసించాలనీ, ఏ ఒక్క బాలలను పనిలో గానీ ప్రమాద భరిత రంగాల్లో పెట్టుకుంటే వారిపై కేసులు నమోదు చేసి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు బాలలతో బాలల కోసము పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రతినిధులు రాష్ట్రంలో బాలకార్మికులు లేకుండా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టి వాటిపై అవగాహన కల్పించడం చేయాలని కోరారు. ముఖ్యంగా అంగన్వాడీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, కార్మిక శాఖ, పోలీసు శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రైల్వే శాఖ, మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ శాఖ, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మరియు ఇతర శాఖల భాగస్వామ్యంలో పూర్తి స్థాయిలో బాల కార్మిక వ్యవస్థను రూపు మాపి 2025 చివరి నాటికి రాష్ట్రాన్ని పూర్తి స్థాయిలో బాలకార్మిక రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దడము జరుగుతుందని తెలిపారు.

## ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోడీ ప్రమాణస్వీకారం



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోడీ మాజీ ప్రధానమంత్రి దివంగత పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రధానిగా వరుసగా మూడుసార్లు చేసిన ప్రమాణ స్వీకారాన్ని సమం చేయడం హర్షించదగ్గ శుభ పరిణామమని బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోనంగి బాలయ్య పడాల్ అన్నారు. మండలలో తాజంగి పంచాయతీ వంతమామిడి గ్రామంలో ఆ పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కదుల్ల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణలతో కలసి మంగళవారం మూడు కిలోల కేక్ కట్ చేసి వేడుక జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట రికార్డును సమం చేశారన్నారు. బిజెపితోనే దేశ భవిష్యత్తు సాధ్యమని మరోమారు రుజువైందన్నారు. దేశం యావత్తు నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అనకాపల్లిని సందర్శించిన డిస్ట్రిక్ట్101 వాకర్స్ గవర్నర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్‌లో అనకాపల్లి వాకర్స్ క్లబ్, ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ వాకర్స్ క్లబ్, తుమ్మపాల వాకర్స్ క్లబ్‌ల సభ్యులతో డిస్టిక్ 101 వాకర్స్ గవర్నర్ టీ. రంగారావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూన్‌లో జరగబోయే కాబినెట్ మీటింగ్ గురించి చర్చించారు. చర్చల అనంతరం పై మూడు క్లబ్బులు అనకాపల్లిలో సంయుక్తంగా నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, కాబినెట్ సెక్రటరీ, జి సూర్యనారాయణ ఆర్ సి, ఏ సి హెచ్ అప్పారావు, కాబినెట్ జాయింట్ సెక్రటరీ, జె పురుషోత్తం ఎంజీఎఫ్ కోఆర్డినేటర్‌లు విశాఖపట్నం నుండి వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి వాకర్స్ క్లబ్ నుండి భీశెట్టి రామకృష్ణ, రాపేటి నారాయణ రావు, డాక్టర్ డి డి నాయుడు, ఆడారి మల్లికార్జున రావు, ఎల్లపు సత్యనారాయణ, కే వీరభద్రరావు, కాండ్రేగుల నూకరాజు మరియు కే రమణ అప్పారావు పాల్గొన్నారు. ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ వాకర్స్ నుండి కాండ్రేగుల జగ్గారావు, కర్రి శివ, పి శంకరబాబు, పి భాస్కరరావు, ఎం దిలీప్ పాల్గొన్నారు. తుమ్మపాల వాకర్స్ క్లబ్ నుండి పిల్లి హర శ్రీనివాసరావు, వై సత్యనారాయణ, ఎం మహేష్, కె బాబూరావు, పి అప్పారావు, ఎస్ వాసు పాల్గొన్నారు.

## జేఈఈ అడ్వాన్స్ లో యలమంచిలి విద్యార్థి ప్రతిభ



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** జేఈఈ అడ్వాన్స్‌లో యలమంచిలి పట్టణానికి చెందిన కట్టమూరి కుషల్ జనరల్ కేటగిరీలో 1345 ర్యాంక్ సాధించాడు. ఈ విద్యార్థి తండ్రి కట్టమూరి రాజేష్ రాంబిల్లి మండలం కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కుషల్ ర్యాంకు సాధించడం పట్ల పలువురు ప్రముఖులు అతని అభినందించారు.

## ఎమ్మెల్యే విజయకుమార్‌కు పలువురి అభినందనలు



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను సోమవారం సాయంత్రం అచ్యుతాపురం జనసేన పార్టీ కార్యాలయంలో యలమంచిలి మున్సిపాలిటీ ఎర్రవరంకు చెందిన జనసేన నాయకులు పిట్టా శ్రీను కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. వీరితో పాటుగా పలువురు ఉపాధ్యాయ సంఘం నేతలు, వివిధ శాఖల ఉద్యోగస్తులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్డీయే కూటమి ప్రమాణస్వీకారం ప్రత్యక్ష ప్రసారం

**విజయనగరం:** సాధారణ, అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో నేడు ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం కొలువుదీరనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గన్నవరం వద్ద కేసారిపల్లిలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా ప్రజలంతా వీక్షించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ఉదయం 10.00 గంటలు నుంచి ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం జిల్లా కేంద్రంలో, అన్ని మండలాల్లో ప్రారంభమవుతుంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుగా ఉదయం 11.27 నిమిషాలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. దీన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో భారీ ఎల్‌ఈడి స్క్రీన్లు, టివి సెట్లను ఏర్పాటు చేశారు. విజయనగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంతోపాటు, ఆనందగజపతి ఆడిటోరియంలో కూడా ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.

**చారిత్రక కట్టడాలకు విద్యుత్ దీపాలు**

ఒక పండుగ వాతావరణంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా కేంద్రంలోని చారిత్రక కట్టడాలను, ప్రభుత్వ భవనాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం, గురజాడ స్వగృహం, విజయనగరం కోట, మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల, మహారాజా సంస్కృత కళాశాల, కలెక్టరేట్ కాంప్లెక్స్, జిల్లా పరిషత్ కార్యాలయం, మర్రిచెన్నారెడ్డి భవనం (డిఆర్‌డిఏ), ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ కాంప్లెక్స్, మున్సిపల్ కార్యాలయం, ఆర్ అండ్‌బి కార్యాలయం, పంచాయితీరాజ్ భవనం, దేవాదాయశాఖ కార్యాలయం తదితర భవనాలను అలంకరించారు. సోమవారం రాత్రి నుంచే ఈ కట్టడాలు విద్యుత్ వెలుగులతో కాంతులీనుతున్నాయి.

## నేటి ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం

### ప్రతి నియోజకవర్గం నుండి ప్రత్యక్ష ప్రసారం



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** నేడు రాష్ట్ర ముఖ్య మంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రతి నియోజకవర్గం పరిధిలో ప్రజలంతా వీక్షించడానికి వీలుగా ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పేర్కొన్నారు. ఉదయం 11.27 నిమిషాలకు మేధ ఐటి పార్క్ (గన్నవరం విమానాశ్రయం ఎదురుగా) కేసరపల్లి విజయవాడలో ప్రమాణ స్వీకర మహోత్సవం జరుగనున్న విషయం విదితమే.

ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో ఆయా మండల అభివృద్ధి కార్యాలయాలలో ఉన్న వీడియో కాన్ఫరెన్స్ విధానంలో ప్రత్యక్ష ప్రసారం నిర్వహిస్తామని, వాటితో పాటు నియోజక వర్గాల ప్రధాన కేంద్రాలలో బిగ్ టివి ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. పాడేరు నియోజకవర్గంలో పాత బస్ స్టాండ్ అంబేద్కర్ కూడలి వద్ద, అరకు నియోజకవర్గంలో గిరిజన మ్యూజియం దగ్గర, రంపచోడవరం నియోజక వర్గంలో ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణంలో బిగ్ స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించే విధంగా ఏర్పాటు చేసినట్లు ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించకోవాలని కలెక్టర్ సూచించారు.

# అగ్రికల్చర్ సాగుపై కలెక్టర్ సమీక్ష



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** సోమవారం కలెక్టరు ఛాంబర్ హాలు లో అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫిషరీస్, అనిమల్ హస్బెండరీ శాఖలతో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష లో అగ్రికల్చర్ శాఖకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, వివిధ పంటల యొక్క వివరాలు , హార్టికల్చర్ శాఖకు సంబంధించి జీడీ, అరటి తోటలు సంబందించి రైతులకు ఉన్నట్టువంటి సమస్యలు మరియు ఫర్టిలైజర్స్ వివరాలు , అనిమల్ హస్బెండరీ సంబంధించి వాక్సిన్స్, సీజనల్ వ్యాధులు, హాస్పిటల్, సిబ్బంది పనితీరు వివరాలు, ఫిషరీస్ శాఖకు సంబందించి స్టాక్ పాయింట్ వివరాలు, ఇలా శాఖ లకు సంబందించి పలు అంశాలు పై ఆయన సమీక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా పశుసంవర్ధన అధికారి ఎస్. మన్మధ రావు, ఏపిఎంఐపి అధికారి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉష అనిరుద్ధుల పరిణయం జరిగింది ఇక్కడే

108 దివ్య తిరుపతులలో ఒకటిగా 'తిరుత్తన్ గాళ్' ఒకటి. 'శివకాశి'కి అత్యంత సమీపంలో ఈ క్షేత్రం దర్శనమిస్తుంది. ఇక్కడి స్వామివారు 'అప్పన్' పేరుతో పిలవబడుతుండగా, అమ్మవారు అనంతనాయకి పేరుతో కొలవబడుతూ ఉంటుంది. శ్రీకృష్ణుడి కుమారుడైన అనిరుద్ధుడికి .. ఉషకి వివాహం జరిగిన ప్రదేశం ఇదేనని స్థల పురాణం చెబుతోంది.

తూర్పు ముఖంగా వేంచేసి వున్న ఇక్కడి స్వామివారిని తిరుమంగై ఆళ్వార్ కీర్తించినట్టు చెబుతారు. ఇక్కడ పాపవినాశన తీర్థం దర్శనమిస్తుంది. ఇక్కడి తీర్థాన్ని శిరస్సు పై చిలకరించుకున్నా, పాపాలు పటాపంచలు అవుతాయని అంటారు. వల్లభ మహారాజుకు . శల్యపాండ్యునికి ఇక్కడి స్వామివారు ప్రత్యక్షమైనట్టు చెబుతారు. 108 దివ్య తిరుపతులలో ఒకటిగా .. మహిమాన్వితమైనదిగా.

## దొంగలపై విషాన్ని వెదజల్లిన ఆదిశేషుడు

దైవం ఆవిర్భవించిన క్షేత్రాల్లో అనేక మహిమలు వినిపిస్తూ ఉంటాయి.. మరెన్నో మహిమలు అనుభవం లోకి వస్తుంటాయి. అలాంటి సంఘటనల వలన ఆ క్షేత్రం యొక్క విశిష్టత పెరుగుతూ వెళుతుంటుంది. అలాంటి మహిమాన్వితమైన క్షేత్రాల్లో ఒకటిగా 'తిరుమయం' కనిపిస్తుంది. 108 దివ్య తిరుపతులలో ఈ క్షేత్రం ఒకటిగా దర్శనమిస్తూ ఉంటుంది.

ఇక్కడి స్వామివారు సత్యగిరినాథుడు .. అమ్మవారు ఉయ్యవందాల్ పేరుతో పూజాభిషేకాలు అందుకుంటూ వుంటారు. సత్యదేవతకు స్వామి ప్రత్యక్షమైన కారణంగా ఈ క్షేత్రాన్ని సత్యవ్రత క్షేత్రమని పిలుస్తారు. ఇక్కడి తీర్థాలలో ఒకటి 'సత్య తీర్థం' పేరుతోనే పిలవబడుతూ ఉంటుంది. చాలా కాలం క్రితం ఒకనాటి రాత్రి ఆలయంలోని స్వామివారి మూర్తిని అపహరించడానికి దొంగలు వచ్చారట. స్వామివారి విగ్రహాన్ని తాకడానికి వాళ్లు ప్రయత్నిస్తుండగా, ఒక్కసారిగా ఆదిశేషువు నిజ రూపాన్ని ధరించి, ఆ దొంగలపై విషాన్ని వెదజల్లినట్టుగా స్థలపురాణం చెబుతోంది. ఈ కారణంగానే స్వామివారు ఇక్కడ ప్రత్యక్షంగా కొలువై ఉన్నాడనేది భక్తుల విశ్వాసం.

## జలపాతంలో పడి.. కర్ణాటకలో హైదరాబాద్ యువకుడు మృతి

చిక్కమగళూరు: స్నేహితుడితో కలిసి సరదాగా విహారయాత్రకు వెళ్లిన ఓ హైదరాబాద్ యువకుడి కథ విషాదాంతమైంది. కర్ణాటకలోని ఓ జలపాతం వద్ద ప్రమాదవశాత్తూ నీటిలో జారిపడి అతడు ప్రాణాలు కోల్పోయాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

హైదరాబాద్‌కు చెందిన శ్రవణ్ (25) ఇటీవల తన స్నేహితుడితో కలిసి చిక్కమగళూరు టూర్‌కు వచ్చాడు. వీరిద్దరూ బైక్ అద్దెకు తీసుకుని కొన్ని పర్యటక ప్రాంతాలను సందర్శించారు. కెమ్మనగుండిలోని హెబ్బె జలపాతం వద్దకు చేరుకున్నారు. గత కొన్ని రోజులుగా ఇక్కడ వర్షాలు కురుస్తుండటంతో జలపాతం వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఈత రానప్పటికీ వీరిద్దరూ ఇక్కడ సెల్ఫీ కోసం ప్రయత్నించి కాలుజారి నీటిలో పడిపోయారు. గమనించిన స్థానికులు వీరిని రక్షించి బయటకు తీసుకొచ్చారు. అయితే, నీటిలో జారినప్పుడు శ్రవణ్ తలకు బండరాయి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడు హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలో సిస్టమ్ అనలిస్ట్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఏపీలో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి



ఆంధ్రప్రదేశ్ లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కూలీలను ఇంటికి తీసుకెళుతున్న టాటా ఏస్ రోడ్డు పక్కన నిలిపి ఉంచిన రెడీమిక్స్ వాహనాన్ని ఢీ కొట్టడంతో ముగ్గురు చనిపోయారు. మరికొందరు గాయపడ్డారు. గుంటూరు జిల్లా పెదకాకానిలోని క్యాన్సర్ ఆసుపత్రి ముందు చోటుచేసుకుందీ ప్రమాదం. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. విజయవాడ నుంచి గుంటూరు వెళుతున్న రెడీమిక్స్ వాహనం పెదకాకాని సమీపంలో హైవేపై బ్రేక్ డౌన్ అయింది. దీంతో వాహనాన్ని రోడ్డుకు కుడి పక్కన నిలిపిన డ్రైవర్.. మెకానిక్ ను తీసుకొచ్చి రిపేర్ చేయిస్తున్నాడు.

ఇంతలో ఓ కారు వేగంగా వచ్చి రెడీమిక్స్ వాహనాన్ని ఢీ కొట్టింది. ఆ వేగానికి రెడీమిక్స్ వాహనం రోడ్డు మధ్యలోకి వచ్చింది. అప్పుడే అటుగా వెళుతున్న టాటా ఏస్ ఈ వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడగా.. టాటా ఏస్ ప్రయాణికుల్లో ఇద్దరు స్పాట్ లోనే చనిపోయారు. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మిగతా ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి.

టాటా ఏస్ లో ఇంటికి వెళుతున్న కూలీల్లో పేరేచర్ల గ్రామానికి చెందిన కె.రాంబాబు(40), గుంటూరుకు చెందిన తేజ(21), పాత గుంటూరుకు చెందిన డి.మధు(25) మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. అలంకరణ పనులకు వెళ్లి వస్తున్న కూలీలు మరికాసేపట్లో ఇంటికి చేరతామనే లోపే ఈ ప్రమాదం జరిగింది. కాగా, ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని గుంటూరులోని ఆసుపత్రులలో చేర్పించి, చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగే ప్రాంతంలోని పలు మార్గాల్లో వాహనాలు రాకుండా ట్రాఫిక్ ను మళ్లించిన అధికారులు ?

విశాఖ పట్నం నుండి చెన్నై వైపు వెళ్లే వాహనాలను కత్తిపూడి నుండి జాతీయ రహదారి 216 మీదుగా ఒంగోలు వైపు.

విశాఖపట్నం నుండి చెన్నై వెళ్లివచ్చే వాహనాలను కత్తిపూడి నుండి ఒంగోలు వైపు మళ్లించడం జరిగింది.

చెన్నై నుండి విశాఖపట్నం వైపువచ్చే వాహనాలు..

ఒంగోలు నుండి రేపల్లె మీదుగా వయా మచిలీపట్నం - లోసర్ బ్రిడ్జి - నరసాపురం - అమలాపురం - కాకినాడ - కత్తిపూడి మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించారు.

బుడంపాడు నుండి తెనాలి - పులిగడ్డ - మచిలీపట్నం - లోసర్ బ్రిడ్జి - నర్సాపురం - కాకినాడ - కత్తిపూడి వైపు మళ్లింపు.

విశాఖపట్నం నుండి హైదరాబాద్ వెళ్ళే వాహనాలను గామన్ బ్రిడ్జి - దేవరపల్లి - జంగారెడ్డిగూడెం - అశ్వరావుపేట - ఖమ్మం మీదుగా హైదరాబాద్ కు.

భీమడోలు - ద్వారకాతిరుమల - కామవరపుకోట - చింతలపూడి నుండి ఖమ్మం వైపు.

ఏలూరు బైపాస్ నుండి - జంగారెడ్డిగూడెం మీదుగా అశ్వరావుపేట - ఖమ్మం మీదుగా హైదరాబాద్ వైపు.

ఏలూరు బైపాస్ - చింతలపూడి నుండి సత్తుపల్లి మీదుగా.

హనుమాన్ జంక్షన్ - నూజివీడు, మైలవరం - ఇబ్రహీంపట్నం - నందిగామ మీదుగా హైదరాబాద్ వైపు మళ్లింపు.

హైదరాబాద్ నుండి విశాఖపట్నం వైపువెళ్లే వాహనాలను నందిగామ - మధిర - వైరా - సత్తుపల్లి - అశ్వరావుపేట - జంగారెడ్డిగూడెం - దేవరపల్లి - గామన బ్రిడ్జి మీదుగా విశాఖపట్నం వైపు.

ఇబ్రహీంపట్నం - మైలవరం - నూజివీడు -హనుమాన్ జంక్షన్ నుండి ఏలూరు బైపాస్ మీదుగా విశాఖపట్నం వైపు.

రామవరప్పాడు - నున్న - పాముల కాలువ - వెలగలేరు - జి.కొండూరు - మైలవరం - నూజివీడు - హనుమాన్ జంక్షన్ - ఏలూరు బైపాస్ మీదుగా విశాఖపట్నం వైపు.

విజయవాడ నుండి ఎనికేపాడు మీదుగా 100 అడుగుల రోడ్డు - తాడిగడప -కంకిపాడు - పామర్రు - గుడివాడ నుండి భీమవరం వైపు.

# మిస్టర్ ధర్మారెడ్డి ఏపీ దాటి వెళ్లద్దు

ఏడు రోజుల క్యాజువల్ సెలవులు ఇచ్చారు ఊపిరి పీల్చుకో ఆ తర్వాత అసలు ఆట మొదలవుతుంది...

శ్రీవెంకటేశ్వర స్వామి దగ్గర నుంచి తప్పించుకోవాలి అని ధర్మారెడ్డి ఎన్నెన్నో ప్రయత్నాలు చేశావు విదేశాలకు పారిపోవాలని ఎన్నెన్నో లేఖలు పెట్టుకున్నావు కానీ శ్రీవారి సొమ్ము రికవరీ కాకుండా నిన్ను ఎలా పంపిస్తాడు అందుకే వేంకటేశ్వర స్వామి విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదు నీ లెటర్ రిజెక్ట్ చేశాడు చేయించాడు ఓకే...

ఏపీ GAD సీల్డ్ కవర్ లో పంపించారు కేవలం 7 రోజులు అనుమతి ఇచ్చి ఏపీ దాటి వెళ్లొద్దు అన్నారు అంటే నీ పని అయిపోయింది ధర్మారెడ్డి గారూ..

అది కూడా ఎందుకు ఇచ్చారో తెలుసా mr ధర్మారెడ్డి చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి ముందు స్వామి వారి దర్శనానికి వస్తున్నారు కాబట్టి నీ ముఖం చూసేందుకు ఇష్టంలేక 7 రోజులు మాత్రమే నీకు విరామం ఇవ్వమన్నారు.

అంతే... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుమలకు వచ్చి వెళ్లిన తర్వాత అసలు ఆట ప్రారంభమవుతుంది శ్రీవారి సేవా టికెట్ల మీద శ్రీవాణి టికెట్ల మీద శ్రీవారి డిపాజిట్ల మీద కమిషన్లకు కక్కుర్తి పడి ఇంజనీరింగ్ పనులకు కేటాయించిన కోట్లాది రూపాయల మీద సిబిఐ సిఐడి ఎంక్వయిరీ ప్రారంభమవుతుంది కాస్కో ధర్మారెడ్డి.

MR ధర్మారెడ్డి నిన్ను ఏ ప్రభుత్వమూ రిలీవ్ చేయాల్సిన అవసరం లేదు పరమ పవిత్రమైన శ్రీవారి సొమ్మును మంచినీళ్ళ లాగా జగన్ మోహన్ రెడ్డి నా జేబులో ఉన్నాడన్న అహంకారంతో అధికార బలంతో డబ్బు మదంతో శ్రీ వారి ఆలయ పవిత్రతను మంట కలిపావు...

7 రోజుల తర్వాత అసలు ఆట మొదలవుతుంది ఇది అంతం కాదు మిస్టర్ అధర్మారెడ్డి ఆరంభం మాత్రమే నీకు కౌంట్ డౌన్ ప్రారంభం అయిందన్నారు...

శ్రీవెంకటేశ్వర స్వామి నీకు ఇచ్చిన 7 రోజులు విరామం తర్వాత నువ్వు వెనక్కి తిరిగి వచ్చిన తర్వాత శ్రీవారి పాదాల ముందు నిలబడి అక్రమంగా సంపాదించిన వెంకన్న సొమ్ము పైసా కు పైసా లెక్క చెప్పేస్తే నిన్ను వదిలేస్తాడు వడ్డీ కాసుల వెంకన్న స్వామి ఒకే నా mr. ధర్మారెడ్డి.

## ఇండియన్ క్యులినరీ ఇన్స్టిట్యూట్ (తిరుపతి) ఆధ్వర్యంలో బీఎస్సీ హాస్పిటాలిటీ, హొటల్ మేనేజ్ మెంట్ కోర్సుల అడ్మిషన్లు ప్రారంభం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కేంద్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి సంస్థ ఇండియన్ క్యులినరీ ఇన్స్టిట్యూట్ (తిరుపతి) ఆధ్వర్యంలో మూడు సంవత్సరాల కలినరీ ఆర్ట్స్‌లో బిబిఏ, రెండు సంవత్సరాల ఎంబీఏ, మూడు సంవత్సరాల బీఎస్సీ హాస్పిటాలిటీ, హొటల్ మేనేజ్ మెంట్ కోర్సుల అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేశారు. మంగళవారం డాబాగార్డెన్స్ విజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియన్ క్యులినరీ ఇన్స్టిట్యూట్ తిరుపతి,నోయిడాలో ఉన్న విద్యా సంస్థల్లో కలినరీ ఎడ్యుకేషన్ రంగంలో స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఇన్స్టిట్యూట్లు ఒకటన్నారు. ఇండియన్ క్యులినరీ ఇన్స్టిట్యూట్-తిరుపతి తన కార్యకలాపాలను ఆగస్టు 2016లో 25 మంది విద్యార్థులతో కలినరీ ఆర్ట్స్ ప్రోగ్రామ్తో ప్రారంభించిందన్నారు. తక్కువ వ్యవధిలో ఇన్స్టిట్యూట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తమ హాస్పిటాలిటీ ఇన్స్టిట్యూట్ ప్రకటించబడిందన్నారు. 2018-19 సంవత్సరంలో మంత్రిత్వ శాఖ నుండి అవార్డును అందుకుందన్నారు.

ఇన్స్టిట్యూట్లో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలైన వంటశాస్త్ర స్టూడియో, స్మార్ట్ క్లాస్ రూమ్లు, ప్రత్యేకమైన కిచెన్లు,ఆధునిక సరికొత్త పరికరాలతో కూడిన మైక్రోబయాలజీ లేబొరేటరీ, వివిధ వంటకాల కోసం శిక్షణా రెస్టారెంట్లు విద్యార్థిని విద్యార్థులకు బాలికలకు ఆధునిక హాస్టల్ సౌకర్యంతో అందుబాటులో ఉన్నాయన్నారు. పాక శాస్త్ర కళ అనేది నేడు ఆతిథ్య పరిశ్రమలో అత్యంత ప్రత్యేకమైన విద్యా రంగంగా ఉందన్నారు. పాఠ్యప్రణాళిక పరిశ్రమ, అకాడెమియా నుండి పాక రంగంలో అత్యుత్తమ వారితో సన్నిహితంగా రూపొందించబడిందన్నారు. ఇది విద్యార్థులను వారి స్వంత వ్యవస్థాపక వెంచర్ కు సిద్ధం చేయడమే కాకుండా సముచిత ప్రాంతంలో అధిక ఉపాధిని, ఉద్యోగ నియామకాన్ని కల్పిస్తుందన్నారు.

ఇన్స్టిట్యూట్లో విద్యార్థులకు నిపుణులైన నిపుణుల బృందం బోధిస్తుందన్నారు. వారు విద్యార్థులకు ఆహారం పట్ల మక్కువ, పాక అభ్యాసం యొక్క అన్ని అంశాలలో రాణించాలనే విధంగా శిక్షణ ఇస్తానన్నారు. ఈ కోర్సుల్లో విద్యార్థులకు ఈ రంగంలో రాణించడానికి అవసరమైన మేనేజ్ మెంట్ నైపుణ్యాలతో పాటు నిపుణులైన వంటగది శిక్షణను అందిస్తుందన్నారు. ఇన్స్టిట్యూట్ సురక్షితమైన వాతావరణం,సౌకర్యవంతమైన గదులు, నిజమైన కుటుంబ అనుభూతిని కలిగి ఉందన్నారు.ఇనిస్టిట్యూట్ దృష్టి పూర్తిగా పాకశాస్త్ర నిపుణులు చెయ్యడమే కాకుండా విలువలు, నైతికతతో కూడిన మంచి మానవులుగా ఉన్న నాయకులను తీర్చిదిద్దడం చేస్తుందన్నారు.

ఐసిఐలు తిరుపతి, నోయిడా శ్రేష్టమైన కేంద్రాలుగా ఇవి నిర్మాణాత్మక క్రమబద్ధమైన అధ్యయన కార్యక్రమాలను అందిస్తాయన్నారు.ఇవి గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీల వంటకళలు వంటల నిర్వహణ, పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, డిమాండ్ ఆధారిత సర్టిఫికేట్,డిప్లొమా కోర్సులను నిర్వహించడం, డాక్యుమెంట్. భారతీయ వంటకాలకు ప్రత్యేకమైన డేటాబేస్ , కమీషన్ అధ్యయనాలు, వంటకాలపై సర్వేను రూపొందించడం ప్రత్యేకతగా వివరించారు.

# ఆంధ్రప్రదేశ్ లో సాక్షి, టివి9, ఎన్టీవీ, 10 టీవీ ప్రసారాలు బంద్

ఆంధ్రప్రదేశ్ లో సాక్షి, టివి9, ఎన్టీవీ, 10 టీవీ ప్రసారాలు బంద్ అయ్యాయి. స్వచ్ఛదంగా నీలి మీడియా ని బ్యాన్ చేస్తున్నారు కేబుల్ ఆపరేటర్లు. రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి ని దెబ్బతీసే విధంగా వార్తలు వండి వార్చడంతో కేబుల్ ఆపరేటర్ల ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంఎస్ఓ లు రాష్ట్ర అభివృద్ధి కి ఆటంకం కలిగించేలా వార్తలు ప్రసారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాష్ట్రం లో అధికారం మారి 48 గంటలు గడుస్తున్నా ఆయా ఛానెల్స్ యజమానుల తీరు మారకపోవడం, అందులో పనిచేసే పెయిడ్ జర్నలిస్టులు, యాంకర్లు ఇంకా రాష్ట్రం పై విషం చిమ్మడం, కొత్త ప్రభుత్వం కొలువు తీరకముందే వ్యతిరేక వార్తల తో రెచ్చిపోవడం, రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినేలా వార్తలు వండి వార్చడం వంటి అంశాలను కేబుల్ ఆపరేటర్లు సీరియస్ గా తీసుకున్నారు. 5 ఏళ్ళు రాష్ట్రాన్ని నాశనం చేసారు. ఇప్పుడు కూడా మారకపోతే ఎలా అంటూ స్వచ్ఛందంగా ఆయా ఛానెల్స్ ని బంద్ చేస్తున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఫైబర్ గ్రిడ్ లో కూడా ఈ ఛానెల్స్ తక్షణమే ఆపాలని నిర్ణయం తీసుకున్నారు. మరో పక్క ఒకే రోజు 12 లక్షలు పడిపోయిన ఫేక్ పేపర్ సాక్షి సర్క్యులేషన్ పడిపోయిన వార్త కూడా సంచలనం సృష్టించింది. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, వాలంటీర్లు ఇలా అందరూ సాక్షి చదవాలి అని ప్రజా సొమ్ము దుర్వినియోగం చేసి 12 లక్షల ఫేక్ సర్క్యులేషన్ ను అధికంగా చూపించారు. ఇప్పుడు అధికారులు ప్రభుత్వం మారడంతో మరు క్షణమే సాక్షి కనపడితే కాళ్ళు విరగ్గొడతామ్ అని కింది స్థాయి అధికారులకు ఉత్తర్వులు జారీ చేసారు. దాంతో ఒకే రోజు సాక్షి 12 లక్షల సర్క్యులేషన్ కోల్పోయింది.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన




**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడ సినిమా హాల్ జంక్షన్ అనిత ఐ క్లినిక్ వారి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ పరవాడ మండల ఇన్చార్జి పంచకర్ల ప్రసాద్, మాజీ జడ్పిటిసి పైల జగన్నాధరావు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ గోపి డాక్టర్ జాక్సన్ సుమారు 250 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 50 మందిని శుక్లాల ఆపరేషన్ కొరకు శంకర పౌండేషన్ హాస్పిటల్ కు పంపించారు . ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి బుగిడి గోవింద్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు , మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాస్ కాసులు, పెద్ద చెరువు ఆయుకట్టుదారుల సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, డి .ఎం. ఎల్ నాయుడు బొద్దపు అయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

## మార్కండేయుడు స్నానమాచరించిన మృత్యువినాశిని తీర్థం



మార్కండేయుడు మహా శివభక్తుడు .. అనునిత్యం పరమశివుడిని పూజించేవాడు. ఆ స్వామి సేవలో .. ఆ స్వామి నామ స్మరణలో మునిగితేలేవాడు. అలాంటి మార్కండేయుడు అల్పాయుష్కుడుగా జన్మించాడు. ఆయన ఆయుష్షు తీరగానే తీసుకువెళ్లడానికి యమధర్మరాజు రాగా, పరమ శివుడు ఆయనను ఎదిరించి మార్కండేయుడికి దీర్ఘాయువును ప్రసాదించాడు.

అలాంటి మార్కండేయుడు మృత్యువు నుంచి బయటపడటానికి ' మృత్యు వినాశిని' అనే తీర్థంలో స్నానమాచరించడం కూడా ఒక కారణమని 'తిరుప్పేర్ నగర్' స్థలపురాణం చెబుతోంది. 108 దివ్య తిరుపతులలో ఒకటైన ఈ క్షేత్రాన్ని 'బృహత్పురి' అని కూడా పిలుస్తారు. ఇక్కడ స్వామివారు 'అప్పకుడత్తాన్' పేరుతోను .. అమ్మవారు కమలవల్లీ తాయారు పేరుతో పూజాభిషేకాలు అందుకుంటున్నారు. స్వామివారికి 'అప్పాలు' అంటే చాలా ఇష్టమట .. అందువల్లనే ఆయనకి ఆ పేరు వచ్చిందని అంటారు. ఇక్కడి మృత్యు వినాశిని తీర్థంలోనే మార్కండేయుడు స్నానమాచరించి దీర్ఘాయువును పొందాడని చెబుతారు. ఇక్కడ స్వామివారు పరాశర మహర్షికి ప్రత్యక్ష దర్శనం ఇచ్చాడు.

## ప్రతిపక్షాల మీద దాడులు తగదు : జగన్ మురారి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): రాజకీయాలలో సిద్ధాంతాల పరంగా విబేధాలు ఉండవచన్ని కాని వ్యక్తిగత, భౌతిక దాడులు తగవని కాంగ్రెస్ నాయకులు జగన్ మురారి అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రమంతా అరాచకం సృష్టించారని, వైసీపీ వారు శాంతి భద్రతలకు ఆటంకం కలిగించారని, సామాన్యుల మీద దౌర్జన్యానికి పాల్పడ్డారని, టీడీపీ ప్రభుత్వంలో శాంతి భద్రతలు బాగుంటాయని ప్రజలు ఆశించి కూటమికి ఓటు వేస్తే కూటమి అధికారంలోకి రాగానే పలు చోట్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ వారి మీద దాడులకు పాల్పడుతున్నారు, ఒకరి మీద ఒకరు దాడులు ఇంకెంతకాలం, చట్టాన్ని చేతులోకి తీసుకోవడం మంచిది కాదు, ఇలాంటి చర్యలు ఆపకపోతే టీడీపీకి ప్రజలు బుద్ధి చెబుతారని జగన్ మురారి అన్నారు.

## ఎన్డీఏ ప్రధాని గా మూడవ సారి మోదీ ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేసిన బీజేపీ నేతలు



చింతపల్లి, (విశాఖ సమాచారమ్): ఎన్డీఏ ప్రధాని గా నరేంద్ర మోడీ మూడవసారి ఎన్నిక పట్ల బీజేపీ సీనియర్ నేత బోనంగి బాలయ్య పడాల్ ,కదుల్ల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు, మంగళవారం చింతపల్లి మండలలో తాజంగి పంచాయతీ వంతమామిడి గ్రామంలో భారత దేశ ప్రధానమంత్రి మూడోసారి ఎన్నికైనందుకు చింతపల్లి మండలంలో తాజంగి పంచాయతీ గల వంతమామిడి గ్రామంలో మూడు కేజీలా కేకు కాట్ చేసిన రాష్ట్ర గిరిజన మోర్చ కార్యవర్గ సభ్యులు బోనంగి బాలయ్యపడాల్ చింతపల్లి మండలం అద్యక్షులు సాగిన బాలకృష్ణ రాష్ట్ర గిరిజన మెర్చ కార్యవర్గ సభ్యులు కదుల్ల శ్రీనువాసరావు 'నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ప్రభాస్ అభిమానులు కేరింతల మధ్య కల్కి మూవీ ట్రైలర్ విడుదల



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన కల్కి మూవీ చిత్రం ఈనెలాఖరులో థియేటర్లో విడుదల అవుతున్న సందర్భంగా సోమవారం థియేట్రికల్ ట్రైలర్ నీ ప్రభాస్ అభిమానుల కోసం భారత దేశ వ్యాప్తంగా విడుదల చేశారు...దానిలో భాగంగా అనకాపల్లి సత్య నారాయణ థియేటర్లో ప్రభాస్ అభిమానుల కేరింతల నడుమ అట్టహాసం గా ట్రైలర్ విడుదల చేసారు. హాలీ వుడ్ స్థాయిలో వున్న ఈ ట్రైలర్ నీ చూసిన అభిమానులు ఆనందానికి అవదులు లేవు.మళ్ళీ చరిత్ర సృష్టించే చిత్రం అవడం ఖాయం అంటూ స్టేట్ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ కార్యవర్గ సబ్యులుజీ వి ఎల్ ఎన్ రాజు , కాంద్రేగుల జో గేంద్ర, అల్ల ప్రవీణ్ సమక్షంలో థియేటర్ అధినేతలు కొణతాల రామ లింగ స్వామి ఆనందోత్సవ కేక్ కట్ చేశారు..ఈకార్యక్రమంలోబుద్ధ శ్రీను,ఏజెంట్ సురేష్, అభిమాన సంఘం రథ సారథులు జీవి యల్ యన్ రాజు,కంద్రెగుల జోగేంద్ర, ఆళ్ల ప్రవీణ్, కొణతాల అరవింద్, అరవింద్,అశోక్,సతీష్ వర్మ,నారి శివయ్య,బుద్ధ మనోహర్, కె.శ్రీనివాస్, తదితరులతో పాటు వందలాది మంది ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

## లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాగ జగదీష్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబును ఉండవల్లిలో వారి స్వగృహంలో కలుసుకొని ఇటీవల శాసనసభ ఎన్నికల్లో మంగళగిరి శాసనసభ నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎన్నికైన సందర్భంగా తెలుగుదేశం పార్టీ మాజీ శాసనమండలి సభ్యులు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు మర్యాదపూర్వకంగా కలుసుకొని ఎమ్మెల్యేగా విజయం సాధించినందుకు స్వీట్ ప్యాకెట్ అందించి శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం శాలువాతో సత్కరించి అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగ ఆరాధ్య దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించారు.

## తెలుగువారి ఆత్మబంధువు రామోజీరావు- వాజీ చానల్ ఎండీ



విజయనగరం, (విశాఖ సమాచారమ్): తెలుగు వెలుగులు ప్రసరింపచేసిన రామోజీరావు తెలుగువారి ఆత్మబంధువు అని వాజీ చానల్ ఎండీ గణపతినీడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వాజీ చానల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈనాడు ఈటీవీ అధినేత రామోజీరావు సంస్మరణ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ అక్షరసూరీడు అస్తమించినా ఆ వెలుగులు శాశ్వతమని, ఆయన కీర్తి ఆచంద్రతారార్కమని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్వీన్ మాట్లాడుతూ రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలిఅని అభివర్ణించారు. ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ నిరంతర శ్రమ, నిత్యం కొత్తదనం కోసం తపన, చెక్కుచెదరని ఆత్మస్థయిర్యం ఆయన స్వంతమని అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జెసి నాయుడు, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ గోటేటి హిమబిందులు మాట్లాడుతూ మొక్కవోని సంకల్పంకలిగిన నిత్యకృషీవలుడు రామోజీ అని, పత్రికా రంగంపై చెరగని సంతకం రామోజీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముందుగా రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రామోజీ ఆత్మకు శాంతి చేకూరాలని మూడునిమిషాలపాటు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో పాత్రికేయ సంఘాల నాయకులు, ఈనాడు- ఈటీవీ సిబ్బంది, మార్గదర్శి సిబ్బంది, సాహిత్య సంస్థల ప్రతినిధులు, నాటకకళారంగానికి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైభవంగా పేర్ల వారి ఇంటి అమ్మ వారి పండగ

### ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జీవీఎంసీ 18వ వార్డులోని పేర్ల వారి ఇంటి అమ్మవారి పండగ అత్యంత వైభవంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో హాజరైన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పండుగకు తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ముఖ్యఅతిథిగా హాజరై పేర్ల వారి ఇంటి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మ వారి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ముందుగా వెలగపూడి రామకృష్ణ బాబుకి కార్పొరేటర్ గొలగాని పోలరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు PERLA MASENU, పుక్కళ్ల ధనలక్ష్మి, GITHAM RAJ SEKHAR, GOKUL SRINU, VASUPILLI POLA RAO (FIREWOKS) స్థానిక భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారి మహోత్సవానికి తనను ఆహ్వానించినందుకు, అమ్మ వారి ఆశీస్సులు పొందే అదృష్టాన్ని తమకు అందజేసినందుకు పేర్ల వారికి ధన్యవాదాలు తెలిపారు.

## చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపిన దేశం శ్రేణులు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఎన్డీఏ కూటమి విజయం సాధించిన సందర్భంగా బుధవారం ముఖ్యమంత్రి గా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా సంతోషిమాత కొవెల వద్ద పాత 19వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రమాణస్వీకారం సందర్భంగా కేకు కట్ చేశారు . సమావేశానికి తెలుగు మహిళలు డ్వాక్రా గ్రూపు సభ్యులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని తెలుగుదేశం వర్ధిల్లాలి చంద్రబాబు నాయుడు జిందాబాద్ పవన్ కళ్యాణ్ జిందాబాద్ పురందేశ్వరి జిందాబాద్ అనే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేక్ ను కార్యకర్త అందరూ అభినందన తెలుపుకుంటూ పంపిణీ చేశారు. పార్లమెంట్ కార్యదర్శి మల్ల గణేష్ , మల్ల రామకృష్ణ మాట్లాడుతూ జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన బిజెపి సమన్వయంతో ముందుకు వెళ్లామని తమ వార్డులో కూటంకి అత్యధిక ఓట్లు లభించాయి అన్నారు . ఈ సందర్భంగా ఓట్లు వేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగుదేశం జనసేన బిజెపి ఇచ్చిన హామీలు ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అందరికీ అందే విధంగా కృషి చేస్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో పిలా రమణారావు మద్దాల వరహ నూకేశ్వరరావు మల్ల జగదీష్ బొడ్డేడ నూకరాజు మల్ల మోహన్ మద్దాల శ్రీనివాసరావు ఆళ్ల గోవింద దొడ్డి శ్రీనివాసరావు దాడి వాసుఅధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు క్రీడా సామాగ్రి అందజేత



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): క్రీడాకారులకు సోమవారం క్రీడా సామాగ్రి అందజేసే కార్యక్రమం స్థానిక చిన్న బజారు వద్ద జరిగింది. కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి దీనభందు షటిల్ టీమ్కు చెందిన సుమారు 30 మంది సభ్యులకు టి షర్టులు, ట్రాక్ షూట్స్, ఇతర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది కె ఎస్ ఎం సుధాకర్, వెంపాడ శ్రీనివాసరెడ్డి, దత్తి ఈశ్వరరావు, ప్రేమ్ కుమార్, కోసూరు రాంబాబు, మాదబత్తుల శంకర్, మకాల శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడిపై విచారం వ్యక్తం చేసిన రాష్ట్రపతి



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జమ్ముకశ్మీర్‌లోని రియాసీ జిల్లాలో యాత్రికుల బస్సుపై జరిగిన ఉగ్రదాడిఘటనపై విచారం వ్యక్తం చేశారు. బస్సు ప్రమాద వార్త నన్ను తీవ్రంగా కలచివేసిందని, ఈ క్రూరమైన చర్య మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరమని ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

## ఈ పిరికిపంద దాడికి పాల్పడిన వారిని వదిలిలేదు: అమిత్ షా



జమ్ముకశ్మీర్ ఉగ్రదాడి పట్ల కేంద్ర మంత్రి అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్, డీజీపీతో మాట్లాడి ఘటనపై సమాచారం తెలుసుకున్నానని, ఈ పిరికిపంద దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టేదిలేదన్నారు. బాధితులకు న్యాయం చేస్తామన్నారు. అత్యవసర వైద్యసేవలు అందించేందుకు స్థానిక యంత్రాంగం యుద్ధప్రాతిపదికన కృషి చేస్తుందని చెప్పారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## దివ్యాంగులకు ట్రెక్కింగ్ అసోసియేషన్ వితరణ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ప్రముఖ సామాజిక కార్యకర్త సంఘ సేవకుడు స్వర్గీయ కుప్పిలి బాల త్రిపుర సుందర్ రావు జ్ఞాపకార్థం వారి కుప్పిల శకుంతల విశాఖ ట్రెక్కింగ్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మానసిక వికలాంగుల అనాధ శరణాలయం కేర్ అండ్ లవ్ ఫౌండేషన్ నకు ఒక నెలకు సరిపోవు కిరాణా గ్రోసరీ ఐటమ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మంత్రి శ్యాం ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఏపీ సోషల్ మీడియా క్లబ్ ప్రెసిడెంట్ సన్ మూర్తి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ట్రెక్కింగ్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కె ఎస్ ఎస్ ఆర్ వర్మ, కేవీ వర్మ, కే.మాధురి మరియు ఇతర మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## జప మాలలు - ఫలితాలు

స్వచ్ఛమైన స్పటిక మాలతో జపం చెస్తే రాజ్యాధికారం, లభించును. సర్వ భోగములు సిద్ధించును. గుణవంతులైన సంతానం లభించును.

ముత్యాల మాలతో జపం చేస్తే సర్వ శాస్త్రములు, సర్వ విద్యలు నాలుక పై తాండవ మాడును.

పగడ మాలతో జపం చేసిన లోకం లొని సమస్త మానవులు, జంతువులు, పశువులు, క్రూర జంతువులు ను వశీకరణం చేసుకొవచ్చు .

ఇంద్ర నీల మణుల మాలతో గాని , మరకత మణుల మాలతో కాని జపం చేయడం వలన శత్రు భయంకరులు అవుతారు.

బంగారు మాలతో జపం చేయడం వలన అష్టైశ్వర్యములు పొందుదురు.

మాణిక్య మాలతో జపం చేసిన వారు తాను కోరిన కన్యను పొందుదురు.

పాదరస గులికలతో కూర్చబడిన మాలతో జపం చేసిన సమస్త ప్రయోజనములు పొందగలుగు శక్తి వంతులగురు .

ఆయుర్వేదములోని ఎన్నొ రహస్య మూలికల అనుభవ యోగాల గురించి నా గ్రంథాల యందు సంపూర్ణముగా , అందరికి అర్థమయ్యే సులభ భాషలో వివరించాను . వాటిని చదివి మరింత విజ్ఞానాన్ని పొందగలరు .

కాళహస్తి వేంకటేశ్వరరావు
అనువంశిక ఆయుర్వేద వైద్యులు
9885030034

## గుండెపోటు – లక్షణాలు

గుండెపోటు రావడానికి మూడు గంటల ముందు కనిపించే లక్షణాలు.

ఒకరికి హార్ట్ ఎటాక్ ఉందని అనుమానం ఉంటే, అతన్ని నడవడానికి అనుమతించకూడదు మెట్లు ఎక్కడం లేదా దిగడం లాంటివి అనుమతించకూడదు ఆటోలో ఆసుపత్రికి వెళ్లకూడదు. వీటిలో ఏ ఒకటి జరిగినా రోగి మనుగడకు కష్టతరం అవుతుంది.

గుండెపోటు (హార్ట్ ఎటాక్)ని మూడు గంటల ముందుగానే పసిగట్టగల అవయవం మన మెదడు. మన శరీర కార్యకలాపాల్లో చిన్నపాటి ఆటంకాలు ఏర్పడినా మెదడు వెంటనే అప్రమత్తం చేస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ జాగ్రత్తను అనుభవించడం కష్టం.

ఏదయిన ఒక వివాహ వేడుకలో, బహిరంగ ప్రదేశాల్లో లేదా ఇంట్లో ఒక పురుషుడు లేదా స్త్రీ పొరపాటున పడిపోతున్నట్లు కనిపిస్తే, మనం వెంటనే వారిపై దృష్టి పెట్టాలి.

కానీ తనకు ఏమీ జరగలేదు, నేను బాగున్నాను అని వారు చెప్పవచ్చు

మనం కూడా ఏదో పైత్యం అని తేలిగ్గా వదిలేయకూడదు.

మెదడు ప్రకటించే హెచ్చరికను చూడగానే వారి ఆరోగ్యం మనకు స్పష్టంగా తెలుస్తుకోవడానికి వారిని STR చేయమని చెప్పాలి..

STR అంటే SMILE (నవ్వమని చెప్పటం), TALK (మాట్లాడమని చెప్పటం) RAISE BOTH HANDS ( రెండు చేతులును పైకెత్తమని చెప్పటం) ఇలాంటి కార్యక్రమాలు చేయమని చెప్పాలి.

వారు ఈ మూడింటిని సరిగ్గా చేయాలి!ఇందులో ఏ ఒకటైన వారు సరిగ్గా చేయకపోయినా సమస్య పెద్దదే! వెంటనే ఆసుపత్రికి తరలించడం వల్ల మరణాన్ని నివారించవచ్చు.

ఈ లక్షణం తెలిసి 3 గంటల్లోపు ఆసుపత్రికి వస్తే ప్రాణ నష్టం చాలా వరకు అరికట్టవచ్చు అంటున్నారు వైద్యులు.

వారు ఈ మూడింటిని బాగా మరియు సరిగ్గా చేసినట్లయ్యే, మరింతధృవీకరించకోవడానికి ఒక ముఖ్యమైన చర్య చేపట్టాలని ఇటీవలి వైద్య అధ్యయనం చెబుతోంది.

తప్పక వారిని వారి నాలుకను బయటకు చాచమని అడగాలి

వారు తన నాలుకను నిటారుగా చాచినట్లయితే, వారు సాధారణ మరియు ఆరోగ్యంగా ఉన్నారని నిర్ధారించవచ్చు, వారు దానిని నేరుగా సాగదీయకపోతే అంటే ఒకే వైపు కుడి లేదా ఎడమ వైపుకు వంగి ఉంటే తదుపరి 3 గంటలలోపు ఎప్పుడైనా, వారికి ఎటాక్ కలుగవచ్చు.

## Hospitals in Visakhapatnam (Vizag)

**Hospital & Address with Phone Numbers**

**King George Hospital:**
Maharanipeta, Visakhapatnam – 530002, Tel: 0891-2564893

**Govt. Victoria Hospital:**
Chengalarao peta, Visakhapatnam. Tel: 0891-2562637

**Apollo Hospitals:**
Waltair Main Road Ram Nagar, Visakhapatnam – 530002. Tel: 0891 272 7272

**Abhaya Hospital:**
KGH Down, Visakhapatnam -2. Tel: 0891-2703444, 2703555

**A N Beach Hospital:**
#15-9-13/24, Krishna Nagar Maharanipeta, Visakhapatnam – 530002. Tel: 0891 326 8080, 0891 326 3339, 9849447777

**Anupama Surgical & Children Hospital:**
Dwaraka Nagar 3rd Lane, Visakhapatnam – 530016. Tel: 0891-666 2122, 274 8811, 9848193004

**Aditya Multicare Hospital:**
#18-1-33, Opp: KGH Gate, Maharanipeta, Visakhapatnam – 530002.
Tel: 0891-256 6664, 9542220555, 9949877717

**Apoorva Hospital:**
#50-17-62, Rajendra Nagar, Seethammapeta, Visakhapatnam.
Tel: 0891-2747436, 2701258

**Bharathi Hospital:**
#14-24-1, Maharanipeta, Visakhapatnam – 530002. Tel: 0891 252 6500, 7093772862

**CARE Hospitals:**
Ramnagar Main road, Visakhapatnam – 530002. Tel: 0891 304 1444

**Manipal Hospital Vishakhapatnam:**
#15-2-8 / A, Near Century Club Maharanipeta, Visakhapatnam – 530002.

**OMNI RK Super Specialty Hospital:**
Opp: Lions Club, Waltair Main Road, Ram Nagar, Visakhapatnam – 530002.
Tel: 0891 308 0300

**Padmasri Hospital:**
#49-48-16 / 5, NH- 5, Akkayyapalem, Visakhapatnam – 530016.
Tel: 0891 273 4747, 656 4747

**Seven Hills Hospital:**
Rockdale Layout, Waltair Main Road, Visakhapatnam – 530002.
Tel: 0891 667 7777, 9393110402

**Samudra Hospitals:**
Andhra Bank, KGH Down, Maharanipeta, Visakhapatnam – 530002.
Tel: 0891-253 3955, 9492533955, 9848133660

**Sraddha Hospital:**
#14-37-45, Near Collector Office Jn., Maharanipeta, Visakhapatnam – 530002.
Tel: 0891-279 7878, 271 6868

**Suraksha Health Park :**
#38-40-42 / 2, 104, Main Road, Marripalem, Visakhapatnam – 530018.
Tel: 0891 664 6666, 669 7777, 9295062622, 9295062636

**Vizag Hospital & Cancer Research Centre:**
MVP Sector- 7, P. No: 1, Visakhapatnam – 530017.
Tel: 0891 255 1811, 255 3212

**Kala Hospitals :**
Beside BVK Degree College Lane, Dwaraka Nagar, Visakhapatnam – 530016.
Tel: 0891 276 4748, 9849123546

**Kanaka Durga Nursing Home:**
#15-6-10A, Near Zillaparishaid, Visakhapatnam -2. Tel: 0891- 5567201, 2569865, 2566932

**Sagara Durga Hospital:**
#15-13-6, Krishna Nagar, Maharanipeta, Visakhapatnam – 530002.
Tel: 0891-252 6833

**Dr. Mangamma Hospital :**
#17-1-17, Opp: KGH Gate, Maharanipeta, Visakhapatnam – 530002.
Tel: 0891-272 0077, 0891-272 0088, 8019131694

**Indus Hospitals :**
KGH down, Maharanipeta, Visakhapatnam – 530002.
Tel: 0891 250 8881, 9848724365, 9948724365

**Mahatma Gandhi Cancer Hospital and Research :**
MVP Colony , Visakhapatnam – 530017.
Tel: 0891 287 8787

**Queens NRI Hospital :**
#50-53-14, Near Gurudwar Rd, Seethammadhara, Visakhapatnam – 530013.
Tel: 0891-282 7777

**Lazarus Hospitals :**
Waltair Main Rd, Opp: Vasan Eye Care, Ram Nagar, Visakhapatnam – 530002
Tel: 0891-2780780, 0891-278 4784

**Icon Krishi Hospitals:**
Near Bharat Heavy Plate & Vessels Ltd. Sheela Nagar, Visakhapatnam – 530012.
Tel: 8885542944, 8885542955, 8885542977

**MGR Hospitals:**
#8-4-32, Doctor's Colony Pedawaltair, Visakhapatnam – 530017.
Tel: 0891 275 5908, 9573247590

**R K Hospital:**
#26-16-7, Gajuwaka, Visakhapatnam – 530026. Tel: 9348423777

**Vivekananda Hospital:**
# 49-9-24 Akkayyapalem, Visakhapatnam – 530016. Tel: 0891 274 8353,
0891-275 0654

**Nikitha Hospital:**
Seethammadhara Junction, Visakhapatnam – 530013. Tel: 0891-250 1501,
271 9797, 271 9696

**Vaishnavi Hospital:**
2nd Lane, Collectorate, Maharanipeta, Visakhapatnam – 530002.
Tel: 0891 252 6896, 395 4185, 9848191332

**Lata Hospitals :**
Gajuwaka, Visakhapatnam – 530026.
Tel: 0891-251 1351

Subham Prema Hospital:
#9-1-227, Opp: Ramatalkies Cinema Hall Jn., Visakhapatnam – 530003.
Tel: 0891-666 6655

**Pallavi Hospital:**
Maharanipeta, Visakhapatnam. Tel: 0891-2567735, 2567736

# విశాఖ రెస్టారెంట్‌లు

1. విండీస్ ఫ్యామిలీ రెస్టారెంట్, బీచ్ రోడ్డు
9848113366, 8985113366
2. హోటల్ న్యూ అనుపమ గ్రాండ్, మిథిలాపురి కాలనీ
9701874255, 9491400500
3. రెడ్ స్పైస్.. ది ఫుడ్ హౌస్
9849700112
4. సన్‌రైస్ రెస్టారెంట్, రుషికొండ
7674888978, 8374298989
5. అతిథి ఇన్, న్యూ రేసపువానిపాలెం
0891 2727567
6. బెస్ట్ వెస్ట్రన్, గాజువాక
929500521
7. దసపల్లా ఎగ్జిక్యూటివ్ కోర్టు, వాల్తేరు మెయిన్ రోడ్డు
0891 2717300 - 305
8. అమరావతి హోటల్స్ & రిసార్ట్స్ డాబాగార్డెన్స్
98667 96491
9. ఫార్చ్యూన్ ఇన్ శ్రీకన్య, ద్వారకానగర్
0891 6688444
10. శ్రీ సాయిరాం పార్లర్, ద్వారకానగర్
0891 9763173
11. వాసన్ పోలి, సర్క్యూట్ హౌస్ ఎదురుగా
88859 79799
12. హోటల్ ఆల్ఫా, జగదాంబ
0891 2761818
13. హోటల్ దసపల్లా, జగదాంబ జంక్షన్
0891 2564825
14. హోటల్ గ్రీన్ పార్క్, వాల్తేరు మెయిన్ రోడ్డు
0891 2564444
15. హోటల్ కృష్ణ టవర్స్, రైల్వే న్యూకాలనీ
93955 54158
16. హోటల్ మేఘాలయ, ఆశీలమెట్ట
0891 2755141
17. ఆరెంజ్ హోటల్, సరస్వతి పార్కు జంక్షన్
0891 2515151
18. క్వాలిటీ ఇన్ బెజ్ కృష్ణ, ద్వారకానగర్
0891 6662666
19. రాయల్ పోర్టు హోటల్, ఆశీలమెట్ట
0891 6622888
20. సరోవర్ హోటల్, ద్వారకానగర్
0891 2755995
21. హోటల్ బెజ్ కృష్ణ, ద్వారకానగర్
0891 6668666

# ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం నేడే



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నాలుగవసారి ప్రమాణ స్వీకార కార్యక్రమం నేడు కేసరపల్లి వేదికగా ఘనంగా జరగనుందని ఆ పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అన్నారు. ఆ పార్టీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్ లతో కలిసి మంగళవారం ఆయన మాట్లాడుతూ వైకాపా రాక్షస పాలనకు చరమగీతం పాడిన ప్రజలు ఎన్డీఏ కూటమిని ఆశీర్వదించారన్నారు. గత ఎన్నికలలో 151 స్థానాలు ఇచ్చిన ప్రజలను వైకాపా ప్రభుత్వం గడచిన ఐదేళ్లు నిలువునా మోసగించిందన్నారు. అభివృద్ధిని విస్మరించిన వైకాపాకు తగిన సమయంలో ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పారన్నారు. అధికార గర్వంతో వై నాట్ 175 అన్న వైకాపాను ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేశారన్నారు. గతంలో ఎన్నడూ కనీ, విని ఎరుగని రీతిలో ప్రజలు ఎన్డీఏ కూటమికి, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీకి 135 స్థానాలు ఇచ్చి అనుభవిజ్ఞుడైన చంద్రబాబు నాయుడుని ఆశీర్వదించారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆలోచన చేసే నిరంతర ప్రజా శ్రామికుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నేడు ముఖ్యమంత్రిగా నాలుగవసారి ప్రమాణస్వీకారం చేస్తున్న ఆయనకు చింతపల్లి మండల కమిటీ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# ఘనంగా యువరత్న బాలకృష్ణ జన్మదిన వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** తెదేపా హిందూపురం ఎమ్మెల్యే, యువరత్న నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు పట్టణ బాలకృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్థానిక పరమేశ్వరి పార్కు సెంటర్ వద్ద సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన దాడి రత్నాకర్ ని పట్టణ బాలకృష్ణ అభిమానులు శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ నట వారసునిగా నందమూరి బాలకృష్ణ ఎన్నో క్లిష్టతరమైన పాత్రలను అవలీలగా పోషించి తండ్రిక "తగ్గతనయుడిగానిరూపించుకున్నారనా న్రు. ఆయన నటించిన చాలా సినిమాలు రికార్డులు సృష్టించాయన్నారు. దివంగత తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్ స్థాపించిన బసవరామ తారకం కేన్సర్ ఆసుపత్రిని ప్రపంచం గర్వించదగ్గ స్థాయికి తీసుకువెళ్లారని కొనియాడారు. అనంతరం అశేష అభిమానుల మధ్య కేక్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షులు పెతకంశెట్టి శ్రీనివాసరావు, పాలిమేర నాయుడు, కరణం, శ్రీను, మళ్ల సురేంద్ర, డి.వి.రావు, సూరిశెట్టి నూకరాజు, అప్పలనాయుడు, సత్యారావు, కోట్ని ఉమ, తెదేపా అభిమానులు, కార్యకర్తలు, బాలకృష్ణ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కుషాక్ ఆనిక్స్ ని ఆటో ట్రాన్స్ మిషన్ తో సిద్ధం చేసిన స్కోడా ఆటో ఇండియా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భారతదేశంలో ప్రీమియం కార్ల సెగ్మెంట్ అనగానే అందరికి గుర్తుకు వచ్చేది స్కోడా కార్లు. అద్భుతమైన ప్రీమియం ఫీచర్లతో ఉండే ఈ కార్లు భారతీయులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు స్కోడా కూడా అద్భుతమైన ఫీచర్లు కలిగిన కార్లని అందిస్తుంది. మరోవైపు స్కోడా ఆటో ఇండియా తమ నిరంతర వ్యూహాల్లో భాగంగా, 5-స్టార్ సేఫ్ ఫ్లీట్‌లో మరో అప్ డేట్ ను అందించింది. అదే కుషాక్ ఆనిక్స్ ఏటీ. స్కోడా అభిమానులు మరియు వినియోగాదరులకు అధిక విలువను అందించే లక్ష్యంతో ఆనిక్స్ ను అందిస్తుంది. నిజానికి వినియోగ దారుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఈ కారుని 2023 మొదటి త్రైమాసికరంలో విడుదల చేశారు. ఇప్పుడు స్కోడా ఆటో ఇండియా, తాజాగా వినియోగాదురుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా, ఇప్పుడు కుషాక్ ఆనిక్స్ లో ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ ను ప్రవేశపెట్టింది. అంతేకాదు సరికొత్త ఫీచర్లతో మరింత మెరుగుపరిచింది. ఇంకా చెప్పాలంటే ఈ సెగ్మెంట్ లో అత్యంత సరసమైన ఆటోమేటిక్ కారు ఇది.

ఈ సందర్భంగా స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ శ్రీ పీటర్ జనేబా మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ..., "ఆనిక్స్ వేరియంట్ మా లైనప్‌లో అద్భుతమైన కారు. అధిక వేరియంట్‌ల ఫీచర్లతో కలిపి ఒక కీలకమైన జోడింపుగా ఉంది. ఈ కొత్త కుషాక్ ఆనిక్స్ మా కస్టమర్‌ల నుండి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌కు అనుగుణంగా రూపొందించాం. అంతే కాకుండా ఇది అందరికి అందుబాటులో ఉండే ధర వద్ద ప్రారంభం అవుతుంది. అన్నింటికి మించి ఆటోమేటిక్ వేరియంట్ లో ఇదే అత్యంత తక్కువ ధర ఉన్న కారు. మరోవైపు వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేని యాజమాన్య అనుభవాన్ని అందించడం, మా కస్టమర్‌లకు మరింత దగ్గరవ్వడం మరియు మా కస్టమర్ లు చెప్పేది నిరంతరం వినడం మా ప్రయత్నం మరియు మా వృద్ధి వ్యూహంలో కీలక భాగం అని అన్నారు ఆయన.

# చిక్ కిచెన్ అప్ గ్రేడ్ కోసం మ్యాట్ ఫినిష్ స్టీల్ డోర్స్ కలిగిన గ్రాఫైట్ రిఫ్రిజిరేటర్స్ ను పరిచయం చేస్తున్న హాయర్ ఇండియా




**భారతదేశం, (విశాఖ సమాచారమ్):** భారతదేశంలో గృహోపకరణాలు అనగానే ప్రతీ ఒక్కరికి గుర్తుకు వచ్చే పేరు హాయర్ ఇండియా. ఇప్పటికే ఎన్నో అద్భుతమైన ఉత్పత్తుల్ని భారతదేశానికి అందించిన హాయర్ ఇండియా.. వరుసగా 15 ఏళ్లపాటు... నెంబర్ వన్ గ్లోబల్ మేజర్ అప్లయెన్సెస్ బ్రాండ్ గా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు తాజాగా ప్రస్తుత సీజన్ కు ఎంతగానో ఉపయోగపడే విధంగా... గ్రాఫైట్ సిరీస్‌ను ఆవిష్కరించింది. ఇది ఆధునిక భారతీయ గృహాల సౌందర్యాన్ని మరో స్థాయికి తీసుకువెళ్లే... అద్భుతమైన మ్యాట్టే ఫినిషింగ్ తో వస్తుంది. అన్నింటికి మించి ఇవి సమకాలీన డిజైన్‌తో ప్రీమియం రేంజ్ స్టీల్ డోర్ రిఫ్రిజిరేటర్ లు. ఈ సిరీస్ 205 లీటర్ల నుంచి 602 లీటర్ల వరకు సామర్థ్యంలో అందుబాటులో ఉంటుంది. మన ఇంటికి కావాల్సిన అన్ని స్టోరేజ్ అవసరాలను తీరుస్తుంది. ఇది ప్రతి భారతీయ కుటుంబానికి అనుకూలంగా ఉంటుంది.

వినియోగదారులు పెట్టే ప్రతీ రూపాయికి విలువ ఉండేలా, వారు పెట్టే ప్రతీ పైసాకు తగ్గట్లుగా ప్రీమియం క్వాలిటీపై దృష్టి సారించి ఉత్పత్తుల్ని రూపొందిస్తుంది హాయర్ ఇండియా. ఇప్పుడు తాజాగా ఆవిష్కరించిన సరికొత్త రేంజ్ రిఫ్రిజిరేటర్‌లు సొగసైన మ్యాట్టే ఫినిషింగ్ డిజైన్‌ను కలిగి ఉంటాయి. అన్నింటికి మించి ఆధునిక భారతీయ గృహాలలో అద్భుతంగా మిళితం అవుతాయి. మరోవైపు వంటగదిని సొగసైనవిగా మార్చేస్తాయి. డైరెక్ట్ కూల్, టాప్-మౌంటెడ్, బాటమ్-మౌంటెడ్, 2-డోర్ సైడ్-బై-సైడ్ మరియు 3-డోర్ సైడ్-సైడ్ వంటి అనేక రకాల కాన్ఫిగరేషన్‌లలో ఈ సిరీస్ అందుబాటులో ఉన్నాయి. హాయర్ తన విప్లవాత్మకమైన 3-డోర్ వై-ఫై కన్వర్టిబుల్ సైడ్ బై సైడ్ రిఫ్రిజిరేటర్స్ రేంజ్ లో మ్యాట్టే ఫినిషింగ్ సిరీస్‌ను కూడా పరిచయం చేసింది. హాయ్-స్మార్ట్ యాప్‌ని ఉపయోగించి ఎక్కడి నుండైనా ఫ్రీజర్ విభాగాన్ని ఫ్రిజ్‌గా మార్చడానికి వినియోగదారులకు అవకాశం కల్పిస్తోంది.

ఈ సందర్భంగా హాయర్ అప్లయన్సెస్ ఇండియా అధ్యక్షులు శ్రీ ఎన్.ఎస్. సతీష్ గారు మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ... "హాయర్ లో మేము... రోజువారీ జీవితాలను సుసంపన్నం చేసే కస్టమర్-ప్రేరేపిత వినూత్న పరిష్కారాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తాము. మా వ్యూహాత్మక దృష్టి సమగ్ర పరిశోధన, అత్యాధునిక సాంకేతికతలు మరియు అత్యంత సమర్థవంతమైన తయారీ ప్రక్రియల పైనే ఉంటుంది. దీనిద్వారా వివిధ వర్గాలలో అత్యుత్తమ-తరగతి ఉత్పత్తులను పరిచయం చేయడం చుట్టూ తిరుగుతుంది. రెండు దశాబ్దాలకు పైగా భారతీయ మార్కెట్లో బలమైన ఉనికిని ఏర్పరుచుకున్న మేము... ఇప్పుడు తాజాగా ప్రారంభించినన గ్రాఫైట్ సిరీస్ ద్వారా ప్రీమియం మార్కెట్ లో మా ముద్రను వేయాలనుకుంటున్నాం. దీనిద్వారా వినియోగదారులకు అత్యుత్తమ గృహోపకరణాలను అందించాలన్న మా నిబద్ధతను ప్రతీ ఒక్కరికీ తెలుస్తుంది.

# అడవివరంలో వైభవంగా ముత్యాలమ్మ పండుగ

## పసుపు కుంకుమలు సమర్పించిన భక్తులు





**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** అడవివరం పరిసర గ్రామ ప్రజల ఆరాధ్య దేవత శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ మహోత్సవం ఈనెల 18న అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఏడుగురు సోదరిమణులు పండుగలు వరుసుగా లండవంశీయులు ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గత ఆదివారం మరిడిమాంబ పండుగ వైభవంగా జరిపించగా తాజాగా మంగళవారం ముత్యాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. లండగరువు, విజనిగిరిపాలెం మధ్య పొలాల్లో ఉన్న సతకం పట్టు ఆలయంలో అమ్మవారికి తెల్లవారు జాము నుంచి పెద్ద ఎత్తున పూజారి వంశీయులు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు గావించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పసుపు, కుంకమలు సమర్పించుకొని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలోనే సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు , సత్తమ్మతల్లి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం పేరంటాలు అమ్మవారిని దర్శించుకొని భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్న సమారాధన శ్రీనుబాబు చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పూజారులు లండవంశీయులు, స్థానిక యువత పాల్గొన్నారు.

# అమిత్ షా, నడ్డా, అశ్విన్ వైష్ణవ్.. బాధ్యతలు చేపట్టిన కేంద్ర మంత్రులు



నరేంద్ర మోదీ కేబినెట్‌లో శాఖల కేటాయింపు అనంతరం మంత్రులు ఒక్కొక్కరుగా బాధ్యతలు స్వీకరిస్తున్నారు. మంగళవారం (జూన్ 11) పలువురు మంత్రులు బాధ్యతలు చేపట్టారు. అమిత్ షా రెండోసారి హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించడానికి ముందు అమిత్ షా నేషనల్ పోలీస్ మెమోరియల్‌కు చేరుకుని అమరులైన పోలీసులకు నివాళులర్పించారు.

బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోగ్య శాఖ బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు పార్టీ కార్యాలయానికి వెళ్లి నేతలతో సమావేశమయ్యారు. అనంతరం మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2014 నుంచి 2019 వరకు మోదీ తొలి కేబినెట్‌లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగా కూడా నడ్డా ఉన్నారు. ఇక ఎస్ జైశంకర్ విదేశాంగ మంత్రిగా రెండోసారి బాధ్యతలు చేపట్టారు. సౌత్ బ్లాక్‌లో ఉన్న విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని మొదటి ఫైల్‌పై ఆయన సంతకం చేశారు.

జౌళి శాఖ మంత్రిగా గిరిరాజ్ సింగ్, ఇంధన శాఖ మంత్రిగా మనోహర్ లాల్ ఖట్టర్ బాధ్యతలు స్వీకరించారు. చిరాగ్ తన తల్లి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. కేరళకు చెందిన తొలి బీజేపీ ఎంపీ సురేష్ గోపీ పర్యాటక శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రైల్వే, సమాచార ప్రసార శాఖ మంత్రిగా అశ్విని వైష్ణవ్ బాధ్యతలు స్వీకరించారు.

కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రిగా అశ్వనీ వైష్ణవ్ ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమానికి అంకితమై ఉందని అన్నారు. మొదటి కేబినెట్ సమావేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 3 కోట్ల ఇళ్ల నిర్మాణానికి తీసుకున్న నిర్ణయం పేదల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి నిదర్శనం అన్నారు. దేశ ప్రజలకు తమ ప్రభుత్వం నిరంతరం సేవ చేస్తూనే ఉంటుందని అన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు ఐదు కోట్ల రూపాయలు మంజూర య్యాయని, ఈ నిధులతో కళాశాలకు అత్యాధునిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి అన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన పాత్రి కేయుల సమావేశంలో ఆమె మాట్లా డుతూ మంజూరైన నిధులతో అదనం గా 16 గదులు నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు. తమ కళాశాలలో అన్ని సబ్జెక్టులకు సంబంధించి అధ్యాప కులు ఉన్నారన్నారు. . సుదూర ప్రాంతం కావడం, సదుపాయాలు లేకపోవడం వలన మన్య ప్రాంతంలో విధులు నిర్వర్తించేందుకు మైదాన ప్రాంత వాసులు ఆసక్తి కనపరచని పరిస్థితులు ఉన్నాయని, ఈ ప్రాంతా నికి వచ్చి విధులు నిర్వహిస్తుంటే ఎంతో ఆహ్లాదంగా ఉందన్నారు. సదుపాయాలు ఉన్నట్లయితే మైదాన ప్రాంతాల నుంచి అధ్యాపకులు మన్య ప్రాంతంలో విధులు నిర్వహించేందుకు ఉత్సాహం చూపుతారని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. మిగిలిన కళాశాలలతో పోల్చి చూస్తే మన్య ప్రాంతంలో విద్యార్థులు సంఖ్య అధికంగా ఉందన్నారు. కళాశాలను అభివృద్ధి పరచడం, గతంలో ఉన్న కోర్సులతో పాటు, అదనంగా మరిన్ని కోర్సులను తీసుకురావడం జరిగింద న్నారు. ఇప్పటికే 871 మంది విద్యా ర్థులు తమ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారని, రాబోవు విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సులలో 420 సీట్లు ఖాళీగా ఉన్నాయని, 2025-26 విద్యా సంవత్స రానికి సంబంధించి కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులను నిర్వహిం చేందుకు కృషి చేస్తున్నట్లు వివరిం చారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస పాత్రుడు, అధ్యాపకులు డాక్టర్ రమణ డాక్టర్ కెజియా, లీలా పావని, రవీంద్ర నాయక్, సంతోషి లతోపాటు ఇతర అధ్యాపకులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు కు ఎంపీ సీ.ఎం రమేష్ శుభాకాంక్షలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** విజయవాడ నగరంలో మంగళవారం ఏ కన్వెన్షన్ లో జరిగిన టీడీపీ బీజేపీ జనసేన శాసనసభ సభ్యులందరూ ఆంధ్రప్రదేశ్ ఎన్డీయే కూటమి నేతగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కూటమి శాసన సభ్యులు అందరితో కలసి అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీ.యం రమేష్ సమావేశం లో పాల్గొన్నారం.ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రబాబు పేరును జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రతిపాదించగా ఈ ప్రతిపాదనకు ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి ఆమోదం తెలిపారు.ఎన్నిక అనంతరం ఆంధ్రప్రదేశ్ కు కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతూ ఎన్డీయే కూటమి విజయం దేశం మొత్తానికి స్ఫూర్తినిచ్చిందని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకువెళ్ళాలని కోరారు.ఎన్డీయే సభాపక్ష నేతగా ఎన్నుకున్నందుకు మూడు పార్టీల నేతలకు,కార్యకర్తలకు చంద్రబాబు ధన్యవాదాలు తెలియజేశారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికే గాక, శారీరక దారుఢ్యానికి, సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం




**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక దారుఢ్యానికి, సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయని అధికారులు, ప్రజా పతినిధులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గత 45 రోజులుగా నిర్వహిస్తున్న ది యూనిటీ కప్ చింతపల్లి సీజన్ 2 అంతర్రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారంతో ముగిసాయి. టోర్నీ నిర్వాహకుడు దొండ చినబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన యూనిటీ కప్ సీజన్ 2 క్రికెట్ టోర్నీకి అల్లూరి జిల్లాలో విశేష స్పందన లభించింది. ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా చింతపల్లికి చెందిన టీచర్స్ జట్టు, పాడేరుకు చెందిన ఆర్‌ఆర్‌ఆర్ జట్టు ఫైనల్ కి చేరుకోగా తుది పోరులో టీచర్స్ జట్టు విజయం సాధించి, ది యూనిటీ కప్ టైటిల్ ని కైవసం చేసుకుంది. విజేతలకు బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్య అతిథులుగా చింతపల్లి ఎస్సై అరుణ్ కిరణ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయభారతి పాల్గొనగా వారితోపాటు టోర్నీ నిర్వహణకు స్పాన్సర్ చేసిన ప్రముఖుల చేతులమీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మొదటి స్థానంలో నిలిచిన టీచర్స్ జట్టుకు 50వేల రూ, ద్వితీయ స్థానంలో నిలిచిన పాడేరు ఆర్‌ఆర్‌ఆర్ జట్టుకు 20 వేల రూ. నగదు బహుమతితో పాటు ఇరు జట్లకు ట్రోఫీలు, ఇరు జట్ల సభ్యులకు షీల్డ్ మరియు మెడల్స్ లను అందజేశారు. బహుమతులను స్పాన్సర్స్ చేసిన వారిలో చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత, హేమంత్ దంపతులు 10 వేలు, చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి 20 వేలు, ఎంపీటీసీ దాసరి దారలక్ష్మి, మత్స్యరాజు దంపతులు 10వేలు, స్థానిక ఇంజనీరింగ్ శాఖ జేఈ లు జ్యోతి బాబు, లోకేష్ లు 20 వేలు, దొండ నాగరాజు 10 వేలు, ఆహా రెస్టారెంట్ యాజమాన్యం ప్రసాద్, నాగేంద్రలు 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అదే క్రమంలో నల్లల శివ సాయి (వీడిఎస్ సౌండ్ సిస్టం) విన్నర్ ట్రోఫీ, కేపీ రాజు ఆర్థిక సహాయంతో రన్నర్ ట్రోఫీ అందజేయగా, పోటీలలో వివిధ విభాగాలలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు పలు బహుమతులను పలువురు స్పాన్సర్ చేశారు. కాగా ఫైనల్ మ్యాచ్లో ఇరుజట్లకు భోజన సదుపాయాన్ని చింతపల్లి సాయి నగర్ వీధికి చెందిన యువ జీవన సేవా సంఘం అధ్యక్షులు కదుల్ల మధుసూదనరావు బృందం సభ్యులు అందజేయగా, క్రీడాకారులకు ఎనర్జీ డ్రింకులను కొమ్మంగి గ్రామానికి చెందిన చల్లంగి బ్రదర్స్ అందించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకుడు చినబాబు మాట్లాడుతూ టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన వివిధ అవసరాలను గ్రామంలోని యువత సమకూర్చారని, వివిధ విభాగాల బహుమతులకు ఆర్థిక తోడ్పాటునందించి ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు.

# అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఐటీడీఏ పీవో

**పాడేరు, (విశాఖ సమాచారమ్):** ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి అభిషేక్ మోద మంగళవారం మోద కొండమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి .ఎస్ ప్రభాకర్, ఎం వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం. హేమలత, ఐటిడిఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.











VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Paderu (P.ravi kumar) : 94908 12271 Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారు మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.